
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 79

సోమవారం 10-6-2024

SIMULTANEOUSLY PRINTED AT ANANTAPUR | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

39 Years of Excellence

Infinity Learn BY SRI CHAITANYA

తెలుగు రాష్ట్రాలు గర్వించేలా... తెలుగు విద్యార్థి గర్వపడేలా...

IIT JEE ADVANCED ఫలితాల్లో శ్రీచైతన్య రాయలసీమ విద్యార్థుల విశ్వరూపం

(తిరుపతి, కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం బ్రాంచ్‌లు)

ALL-INDIA ALL CATEGORY BELOW 10 RANKS

- ఆలిండియా 1 RANK — BIBASWAN BISWAS* — H.T. NO: 245058146 (SC)
- ఆలిండియా 3 RANK — SATIVADA JYOTHIRADITYA — H.T. NO: 246022079 (OBC)
- ఆలిండియా 4 RANK — VASANTA SRIRAJ — H.T. NO: 246162238 (ST)
- ఆలిండియా 5 RANK — HIMANSHU THALOR* — H.T. NO: 242050438 (OBC)
- ఆలిండియా 6 RANK — RAJDEEP MISHRA* — H.T. NO: 241016176
- ఆలిండియా 8 RANK — P V S D SAI MOHITH — H.T. NO: 246008172 (EWS)
- ఆలిండియా 9 RANK — M E VENKATA PARTHIV — H.T. NO: 246162250 (EWS)
- ఆలిండియా 10 RANK — A S S D B SIDHVIK SUHAS — H.T. NO: 246119101

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీచైతన్య సాధించిన టాప్ 1000లోపు 203 ర్యాంకులు

- 106 RANK — ADITYA ADHANA
- 112 RANK — CHELLURI CHAKRADHAR
- 120 RANK — VAIDIK
- 122 RANK — POTTA NISWANTH
- 123 RANK — SREEKANTH M
- 124 RANK — AYUSH GANGAL
- 125 RANK — MANOJ SOHAN GAJULA
- 135 RANK — ANVESH SUBHAM PRADHAN
- 142 RANK — MEDIKONDURI AARYAN SRIRAM
- 145 RANK — KRISHNA AGRAWAL
- 149 RANK — VISHARAD SRIVASTAVA
- 150 RANK — AKASH KUMAR
- 152 RANK — ARYAN GUPTA
- 154 RANK — BATCHU ADWAITH
- 156 RANK — AARUSH
- 160 RANK — ARCHIT RAHUL PATIL
- 164 RANK — ABHINAV V
- 165 RANK — MARADANA SAI SIVA LOCHAN
- 167 RANK — DORISALA SRINIVASA REDDY
- 169 RANK — KASAVAJJALA SAI SHREYAS
- 172 RANK — P NIKHIL CHANDRA
- 175 RANK — PALADIRI SATHISH REDDY
- 178 RANK — KRISH JAIN
- 180 RANK — SOHAM DANGE
- 181 RANK — YALAMARTHI SATYA SRI NEELESH
- 183 RANK — GADE V S S R K TEJAS REDDY
- 185 RANK — REDDI ANIL
- 192 RANK — MAVURU JASWITH
- 204 RANK — GUNTAKANTI SAI GOUTHAM
- 206 RANK — INAPAKURTI RAJESH
- 207 RANK — AIKLAVYAVEER SINGH RANA
- 210 RANK — GAUTHAM TATHANDA
- 213 RANK — T SAI DHEERAJ
- 214 RANK — AKARSH RAJ SAHAY
- 215 RANK — YENDIKATLA TAGORE RAVINDRA SREE
- 219 RANK — SHREYAS ASTHANA
- 223 RANK — GURRAM HARI CHAITANYA
- 224 RANK — ARMAN SINGHAL
- 227 RANK — KUMARAKALVA PRABHAKAR REDDY
- 228 RANK — RACHIT AHUJA
- 233 RANK — KONDREDDY SAI HANEESH REDDY
- 235 RANK — MUDDA MANIKANTA PRUTHVI RAJ
- 238 RANK — JULAPELLY HANIKAR RAO
- 242 RANK — AVTANSH GARGYA
- 244 RANK — SIDDU CHANDRA TEJA
- 248 RANK — INESH AGGARWAL
- 249 RANK — SALLURI VIVEK
- 252 RANK — GOLLA LEKHA HARSHAA
- 253 RANK — DESU G V N S ARYA CHARAN
- 259 RANK — PALAKSH GOYAL
- 260 RANK — DIVYAANSH PANKAJ NARKHEDE
- 264 RANK — ARNAV GARG
- 274 RANK — KODALI RAMANA GOPAL
- 275 RANK — SIDDHANT AGRAWAL
- 283 RANK — DHRUV GAUD
- 297 RANK — SHREYAS DALLATIGI
- 299 RANK — ADITHYA A
- 304 RANK — SHUBHRADEEP PAUL
- 308 RANK — KUNTIMADDI HARI HARA TEJA
- 311 RANK — MD KHAJA GHOUSE MOHIUDDIN
- 318 RANK — SRUTARSHI TRIPATHI
- 326 RANK — DHANUKONDA SRINIDHI
- 333 RANK — MURARI GANESH SAI
- 334 RANK — GUNDA GNANESH
- 339 RANK — YASH VASHISHT
- 353 RANK — SIKHAKOLLI GURU SAI TEJA
- 355 RANK — VENNELA NITHEESH KUMAR
- 369 RANK — YASHDEEP SINGH
- 379 RANK — ALAPATI PURNA PRITAM REDDY
- 384 RANK — TUSHAR
- 393 RANK — POLAMARASETTY KARUNYA
- 395 RANK — KESHAV NAVANDAR
- 399 RANK — ANNEPU SATWIK
- 401 RANK — RAMANATHI SRI HARINATH
- 402 RANK — KOTHA HARDHIK REDDY
- 405 RANK — BETHI PRIYESH REDDY
- 406 RANK — THORAT ARNAV GORAKSHNATH
- 410 RANK — AVVARU YASASVI
- 420 RANK — ANNAREDDY VENKATA TANISH REDDY
- 421 RANK — SANVI JAIN
- 431 RANK — AILONI SAHASRANSH REDDY
- 435 RANK — GURNOOR SOHAL
- 436 RANK — RAMIREDDYGARI SURENDHAR REDDY
- 440 RANK — KUSUKUNTLA VISHAL REDDY
- 454 RANK — THAMATAM JAYADEV REDDY
- 465 RANK — ANJAN SINGLA
- 467 RANK — SHUBHAJEET DAS
- 470 RANK — KRISH NARSARIA
- 481 RANK — ANURAG KISHOR PATIL
- 484 RANK — PRABHNOOR
- 494 RANK — VASANTA SRIRAJ
- 495 RANK — VISHRUT GURRALA
- 508 RANK — KAMJULA SUMANTH REDDY
- 509 RANK — DEVESH MARYA
- 519 RANK — SATHVIK PRABHU
- 522 RANK — SANNAPUREDDY RAHUL REDDY
- 525 RANK — RAHUL RAO
- 544 RANK — NIKET GARG
- 551 RANK — KESHAV KAUSHIK
- 556 RANK — LUKKA AKSHARA
- 573 RANK — SUVIT VISHWAKARMA
- 579 RANK — PANCHANENI ASHWIN RAO
- 591 RANK — SHOURYA AGARWAL
- 599 RANK — PULIGADDA SUHAS
- 600 RANK — GOLLAPALLI SURYA VENKATA MANIDEEP
- 604 RANK — CHIRUVELLA GAGAN CHANDRA SAI RAM
- 617 RANK — BOREDDY SRI SAI ABHINAV REDDY
- 620 RANK — LAKSHIT JAIN
- 645 RANK — SRINIVAS REDDY GUNTAKA
- 647 RANK — ADITYAVARDHAN SRIVASTAVA
- 658 RANK — KAKUMANU DHANUSH
- 662 RANK — RACHIT TUSHARBHAI JANI
- 670 RANK — DASARI UPENDRA
- 671 RANK — KARTIK GOYAL
- 685 RANK — PEDAPROLU LAKSHMI KUSHAL
- 690 RANK — KOLLI SURYA SHASHANK
- 693 RANK — THOTA DHEERAJESWAR
- 694 RANK — MARISETTI SAI CHARAN
- 696 RANK — IBTESAM AHMED
- 704 RANK — MUTHYAPU MANVIK
- 708 RANK — CHESTA JAIN
- 712 RANK — YERRAIAHGARI RAM CHARAN GOUD
- 713 RANK — BOOSARAJU SACHIN
- 714 RANK — JALAGAM SAI RISHITH
- 716 RANK — SUJAL SATISH MOTAGI
- 720 RANK — THIRAPATI PRUDHVI REDDY
- 724 RANK — LAKSHAY KUMAR
- 725 RANK — SUGADA ROOPANSHA
- 729 RANK — KANAKALA JASWANTH KUMAR
- 740 RANK — PRIYAL PATEL
- 764 RANK — ADISH GUPTA
- 767 RANK — NANNAPANENI HARSHA KIRAN
- 772 RANK — NITHISH B
- 779 RANK — BUDDA TANMAY
- 780 RANK — MOYYA HARSHA VARDHAN
- 784 RANK — AYUSH RAI
- 787 RANK — GOLLA SHRIRAM
- 792 RANK — KALLU VENKATA PRASUN
- 795 RANK — AARON JASON BAPTIST
- 802 RANK — KOLLI KARNAKAR REDDY
- 803 RANK — RAMALINGAM NAIDU ALLU
- 804 RANK — NEELA PRATHIK KUMAR
- 807 RANK — GOVINDU SIDHARTHA REDDY
- 808 RANK — DHRUV MUNDRA
- 809 RANK — SAGARIKA SINHA
- 813 RANK — MOHAMMAD ASAD UR RAHMAN NISAR
- 836 RANK — ADITYA GARG
- 838 RANK — SWAMINATH SHIJU
- 839 RANK — PAKALA TARUN REDDY
- 844 RANK — ERANKI VENKATA JHANANI
- 845 RANK — VADDAMANU AAKASH AADHITHYA
- 846 RANK — PUNEETH NETTEM
- 852 RANK — KONCHADA HARSHITH SUBUDHI
- 873 RANK — CHALLARAPU ABHIRAM
- 874 RANK — RISHABH PARWAL
- 879 RANK — KORADA JAYAVARDHAN
- 880 RANK — PATURI HEMANTH SAI
- 891 RANK — DHAIRYA GOYAL
- 898 RANK — M B THEJESSHWAR
- 899 RANK — VINAYAK CHANDRA SRIVASTAVA
- 909 RANK — LEKHYA PILLARIKUPPAM
- 926 RANK — RATTANDEEP SINGH PUAR
- 928 RANK — PENUGONDA VENKATA SRINIVAS
- 929 RANK — HARI SAI SRI TEJA DIKSHITH
- 935 RANK — PONNAGANTI PAVAN KUMAR
- 944 RANK — KARRI VENKATA KARRENNA VYBHAV
- 945 RANK — RAMAGIRI SATHWIK
- 973 RANK — MUTHU S
- 976 RANK — MALLA NANDAN SANTOSH
- 997 RANK — NIHAR CHOUHAN
- 998 RANK — LAKKIREDDY DIXIT REDDY
- 999 RANK — TELAGAMSETTY MANIKANTA SAI
- 1000 RANK — PEMMASANI SRINAADD

Congratulations

IIT-JEE MAIN & ADVANCED
LONGTERM 2025

క్లాసులు 15 జూన్ 2024 నుండి ప్రారంభం

ADMISSIONS OPEN

VIJAYAWADA
RAMAN BHAVAN-I :
97040 65666, 96526 99222

VISAKHAPATNAM
80740 17511, 91772 06961

GUNTUR
97042 88444

ALL INDIA / STATE RANKS	JEE MAIN-2024	JEE ADV-2024	AP EAPCET	TS EAPCET
<=2500	100%	100%	80%	80%
<=5000	100%	100%	60%	60%
<=10000	75%	75%	30%	30%
<=20000	50%	50%	20%	20%
SC/ST/PW BEST RANKERS	60%	60%		

*Best of one is taken into Consideration

Scan QR code for WEBSITE

ADMISSIONS OPEN
Knowledge Hub
NEET | IIT JEE | FOUNDATION
COACHING CENTRES

VIZAG
91774 44307

www.srichaitanyaknowledgehub.com

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback | *DLP / AITS

సాక్షి
అనంతపురం

సోమవారం, 10, జూన్, 2024



'జేఈఈ అడ్వాన్స్‌డ్' లో ప్రతిభ

ప్రతిష్టాత్మకమైన ఐఐటీ కళాశాలల్లోని ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. 2లో



వేర్వేరు చోట్ల ఏడుగురి ఆత్మహత్య

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకేరోజు వివిధ కారణాలతో ఏడుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. 2లో

గరిష్టం/కనిష్టం
34.5°/22.3°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు 2,655 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. డ్యాం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో ఆదివారం ఉదయానికి 2,655 క్యూసెక్కులకు చేరింది. డ్యాంలో ప్రసుతం 1,579.36 అడుగుల నీటి మట్టంతో 4.168 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది రిజర్వాయర్‌లో ఇదే సమయానికి 1,581.08 అడుగుల వద్ద 5.018 టీఎంసీల నీరు ఉండేవి. ఇన్‌ఫ్లో 139 క్యూసెక్కులుండింది.

పోస్టింగ్ కోసం ప్రదక్షిణలు

- కొత్త ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్న ఖాకీలు

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల ఘట్టం ముగిసింది. రాష్ట్రంలో త్వరలో టీడీపీ ప్రభుత్వం కొలువు దీరనుంది. ఈ క్రమంలో పోస్టింగ్‌ల కోసం పలువురు ఖాకీలు కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారి చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తరువాత డీఎస్పీ, సీఐ, తదితర అధికారుల బదిలీలు జరగడం సాధారణం. దీంతో పలువురు ఖాకీలు ఫలానా చోట తమను నియమించాలంటూ ఎమ్మెల్యేల వద్దకు క్యూ కడుతున్నట్లు తెలిసింది. విజిలెన్స్, డీసీఆర్‌బీతో పాటు మరికొన్ని విభాగాల్లో పని చేస్తున్న కొందరు ఇన్‌స్పెక్టర్లు తమకు పరిచయం ఉన్న టీడీపీ నాయకుల ద్వారా మంతనాలు నడుపుతున్నట్లు సమాచారం. అనంతపురం డీఎస్పీ పోస్టు కోసం ఐదుగురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు పోలీసు శాఖలో చర్చ నడుస్తోంది.

వివిధ రూపాల్లో యత్నాలు..

అనంతపురం నగరంలో మొత్తం నాలుగు పోలీస్ సర్కిళ్లు ఉండగా ఆయా సర్కిళ్లలో పోస్టింగులు దక్కించుకునేందుకు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ఇలాంటి వారిలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన వారు కొందరు ఉండగా, ప్రస్తుతం జిల్లాలోనే లూప్ లైన్ విభాగాల్లో పనిచేస్తున్న వారు మరికొందరు ఉన్నట్లు తెలిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజాప్రతినిధులతో పాటు ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల సమయంలో టీడీపీ గెలుపు కోసం కృషి చేశామని, పార్టీకి విధేయులమని, మమ్మల్ని మరవొద్దు అని సాగిలపడుతున్నట్లు సమాచారం.

డీఐజీ, ఎస్పీలనూ మారుస్తారా?

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన అనంతరం జిల్లాలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఎస్పీగా పనిచేస్తున్న అన్బురాజన్‌ను ఎన్నికల కమిషన్ బదిలీ చేసి, అమిత్ బర్దర్‌ను నియమించింది. అయితే, తాడిపత్రిలో అల్లర్లను కట్టడి చేయడంలో విఫలమయ్యారంటూ ఆయననూ సస్పెండ్ చేసి, గౌతమిశాలిని ఎస్పీగా నియమించింది. అనంతపురం రేంజ్ డీఐజీగా ఉన్న అమ్మిరెడ్డిని కూడా బదిలీ చేసి ఆయన స్థానంలో షిమోషిని పంపింది. అనంతపురం అర్బన్ డీఎస్పీగా ఉన్న వీర రాఘవ రెడ్డిని బదిలీ చేసి టీవీపీ ప్రతాప్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానున్న నేపథ్యంలో వీరినే కొనసాగిస్తారా అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. ఈ విషయాలన్నింటిపై ఈ నెల 15న స్పష్టత రానున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ముద్దొస్తున్న తెల్ల బంగారం

పత్తి సాగు.. బాగు

- ఈ ఖరీఫ్‌లో 48,586 హెక్టార్లలో సాగవుతుందని అంచనా
- అందులో 30 శాతానికిపైగా వాటా పెద్దవడుగూరుదే..
- 2011 నుంచి పెరిగిన పత్తి సాగు విస్తీర్ణం
- 20 మండలాల్లోని నల్లరేగళ్లలో సాగవుతున్న పంట



నల్లరేగడి నేల



పత్తి పంట

అనంతపురం అగ్రికల్చర్: నల్లరేగళ్లలో తెల్ల బంగారం అన్నట్లుగా జిల్లాలో ఇటీవల కాలంలో పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఖరీఫ్‌లో ఏటా 'పత్తి' పంట విస్తీర్ణం పెరుగుతోంది. ఉచిత పంటల బీమా వర్తింపుతో పాటు పెద్ద ఎత్తున పరిహారం ఇస్తుండటం, కనీస మద్దతు ధర, అలాగే బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభిస్తుండటంతో పంట సాగుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు.

పెద్దవడుగూరులో అత్యధికం..

ప్రధానంగా పెద్దవడుగూరు మండలం పత్తికి కేరాఫ్‌గా నిలుస్తోంది. మండలంలో మెజార్టీ రైతులు పత్తి పంటపై మొగ్గు చూపిస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 48,586 హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి సాగులోకి రావచ్చని అధికారికంగా అంచనా వేశారు. అందులో పెద్దవడుగూరు మండలంలోనే 30 శాతానికి పైగా అంటే సుమారు 16 వేల హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా. ఆ తర్వాత యాడికి 4,800 హెక్టార్లు, తాడిపత్రి 3,500 హెక్టార్లు, గుత్తి 3,200 హెక్టార్లు, విడపనకల్లు 3,100 హెక్టార్లు, డి.హీరేహాళ్ 3 వేల హెక్టార్లు, కణేకల్లు, బొమ్మనహాళ్, శింగనమల, పెద్దపప్పూరు, పుట్లూరు, వజ్రకరూరు తదితర నల్లరేగడి భూములు కలిగిన 20 మండలాల్లో పత్తి కొంత మేర సాగులోకి రానుంది. గత పంట నష్టానికి సంబంధించి పెద్ద మొత్తంలో పరిహారం వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెట్టించిన ఉత్సాహంతో సాగు ప్రారంభించారు.



2011 నుంచి పెరుగుతూ..

2010 వరకు జిల్లాలో పత్తి సాగు నామమాత్రంగా ఉన్నట్లు వ్యవసాయశాఖ రికార్డులు చెబుతున్నాయి. 2000 నుంచి 2010 వరకు ఏటా ఖరీఫ్‌లో 3 వేల హెక్టార్ల నుంచి 5 వేల హెక్టార్ల లోపే పంట సాగు చేశారు. అయితే 2011 నుంచి ఒక్కసారిగా పత్తి విస్తీర్ణం ఎకబాకింది. ఏకపంటగా విస్తరించిన వేరుశనగ ద్వారా నష్టాలు రావడంతో చాలా మంది రైతులు పత్తిపై దృష్టి పెట్టారు. అలా 2011 నాటికి పత్తి విస్తీర్ణం 19 వేల హెక్టార్లకు చేరుకుంది. 2014 నాటికి ఏకంగా 73,734 హెక్టార్లకు విస్తరించడంతో వేరుశనగ, కంది తర్వాత మూడో ప్రధానపంటగా అవతరించింది. 2014, 2015లో గులాబీ పురుగు, 2016, 2017లో వర్షాలు లేక పత్తి నష్టాలు తెచ్చిపెట్టినా పంట స్థిరంగా కొన'సాగు'తోంది. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి విస్తీర్ణం 38 వేల హెక్టార్లకు పరిమితమైంది. 2022లో మంచి వర్షాలు రావడంతో 77 వేల హెక్టార్ల గరిష్టానికి తాకడం విశేషం.

2008 నుంచి పత్తి పంట సాగు విస్తీర్ణం ఇలా...

సంవత్సరం	పంట సాగు (హెక్టార్లలో)	సంవత్సరం	పంట సాగు (హెక్టార్లలో)
2008	1,610	2009	2,026
2010	4,289	2011	18,997
2012	27,556	2013	37,637
2014	73,734	2015	60,240
2016	30,394	2017	43,615
2018	47,176	2019	51,852
2020	48,409	2021	43,477
2022	76,610	2023	32,584

స్థిరంగా పత్తి ధరలు

పెద్దవడుగూరు, పామిడి, తాడిపత్రి, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో నల్లరేగడి నేలలు అధికంగా ఉన్నాయి. ఇవి పత్తిపంటకు చాలా అనుకూలం. ఇటీవల కాలంగా పత్తి పంటను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. దీనికితోడు దగ్గర్లోనే ఆదోని మార్కెట్‌లో పత్తి క్రయవిక్రయాలు ఎక్కువగా ఉండడం జిల్లా రైతులకు కలసివస్తోంది. గత కొన్నేళ్లుగా పత్తి ధరలు స్థిరంగా ఉండడం, ప్రభుత్వం 'పత్తి'కి పంటల బీమా వర్తింపజేస్తుండడంతో సాగు పెరుగుతోంది.

– ఎం. రవి, ఏడీఏ, అనంతపురం

మార్కులే సర్వస్వం కాదు

- డీవైఈఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డీవైఈఓ శ్రీనివాసరావు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులకు మార్కులే సర్వసం కాదని అనంతపురం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి (డీవైఈఓ) బి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం అనంతపురం నగర శివారులోని తపోవనం మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యక్తి సంపూర్ణ అభివృద్ధికి విద్య చాలా కీలకం అన్నారు. పిల్లల మానసిక స్థితిని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వారు చొరవ చూపిస్తున్న అంశాల్లోనే చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. విద్యా వికాసాన్ని, సంతోషాన్ని, మానసిక ఆనందాన్ని ఇవ్వాలన్నారు. డెప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణతో పాటు సంస్కారం నేర్పించడంలో తల్లిదండ్రులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ ఎంచుకున్న రంగంలో రాణించేందుకు కష్టపడాలన్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన పద్మశాలి విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి యుగంధర్, సభ్యులు శివరుద్రప్ప, లక్ష్మీనరసింహ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు జంక్షన్‌లో ప్రగతి కూత



తొలగించనున్న గుంతకల్లు రైల్వే స్టేషన్ 6,7 ప్లాట్‌ఫారంలోని భవనాలు



ఇటీవల దక్షిణం వైపున నిర్మించిన నూతన రైల్వే స్టేషన్ భవనం

- త్వరలో రూ.60 కోట్లతో పనులు
- పురాతన భవనాల తొలగింపు
- రైల్వే లైన్ల అనుసంధానం

గుంతకల్లు: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయంగా గుంతకల్లు రైల్వే జంక్షన్‌ను మరింత అభివృద్ధి చేయడానికి రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల స్టేషన్ దక్షిణం వైపు రూ. 50 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టారు. ప్రవేశ మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అదనంగా ఒక ప్లాట్ ఫాం ఏర్పాటు చేశారు. ఆకట్టుకునేలా పార్కును నిర్మించారు. దీంతో గతంలో రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఎయిర్‌పోర్టు తరహాలో స్టేషన్ ఉందంటూ కితాబు ఇచ్చారు.

మరింత అభివృద్ధి దిశగా..

ఈ క్రమంలో స్టేషన్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక రైల్వే అధికారులు నిర్ణయించారు. స్టేషన్‌లో దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన భవనాలను తొలగించడంతోపాటు రైల్వే లైన్ల అనుసంధానం పనులను చేపట్టాలని ప్రణాళికలు తయారుచేశారు. ఇందుకు దాదాపు రూ.60 కోట్ల అంచనా వ్యయంతో నివేదిక తయారు చేసి రైల్వే బోర్డుకు పంపారు.

భవనాల తొలగింపు..

గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని 6,7 ప్లాట్‌ఫారంలలో 80 ఏళ్ల క్రితం భవనాలు నిర్మించారు. వీటిల్లో క్యాంటీన్లు, అనౌన్స్‌మెంట్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ భవనాలు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో, వీటిని తొలగించాలనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. అదేవిధంగా పాత బుకింగ్ కార్యాలయాన్ని, ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. గతంలో ఈ భవనాల్లో టీటీల స్లీపర్ ఆఫీసు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రెస్ట్ రూమ్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ డీఎస్పీ కార్యాలయాలతోపాటు హెల్త్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, పార్సిల్ ఆఫీస్, ఎస్ఎంఆర్ ఆఫీస్, డిప్యూటీ ఎస్ఎస్ ఆఫీస్ తదితర కార్యాలయాలు ఉండేవి. నూతనంగా రైల్వే స్టేషన్ నిర్మించడంతో అక్కడికి వీటిని మార్చారు.

అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ కూడా..

రైల్వే లైన్ల అనుసంధానానికి సంబంధించి కూడా ఆ విభాగపు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం గుంతకల్లు జంక్షన్‌లో 7 ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. అయితే 1,2,3 ప్లాట్‌ఫారాల్లోకి వచ్చే రైళ్లు 4,5,6,7 ప్లాట్‌ఫారాల్లోకి వచ్చే సౌకర్యం లేదు. దీంతో అన్ని ప్లాట్‌ఫారాల్లోకి రైళ్ల రాకపోకలు సాగించేలా ప్రణాళికలు తయారు చేసి ఇప్పటికే రైల్వే బోర్డుకు పంపారు. ఈ పనుల్లో భాగంగా ఆధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. రైల్వే బోర్డు నుంచి ఉత్తర్వులు రాగానే పనులు చేపట్టనున్నారు.

ఆరిపోయిన ఆశల దీపం

- రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం
- కర్నూలు నగరంలో ఘటన
- పిల్లిగుండ్లలో విషాదఛాయలు



తల్లిదండ్రులతో తేజేశ్వర్‌రెడ్డి (వృత్తంలో ఉన్న వ్యక్తి) (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్)/ రొళ్ల: ఆశల దీపం ఆరిపోయింది. రోడ్డు ప్రమాదం ఓ వైద్య విద్యార్థిని బలి తీసుకుంది. కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న ఆర్.తేజేశ్వర్ రెడ్డి(22) ఆదివారం మృత్యువాత పడ్డాడు. ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా రొళ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన రంగనాథ్ (రత్నగిరి జెడ్పీ హైస్కూల్ టీచర్), గీతాలక్ష్మి (పిల్లిగుండ్ల గొల్లహట్టి ప్రాథమిక పాఠశాల టీచర్) దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు తేజేశ్వర్‌రెడ్డి కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. ఇక చిన్న కుమారుడు వర్షిత్‌రెడ్డి బెంగళూరులో ఇంజినీరింగ్ కోర్సు చేస్తున్నాడు. తేజేశ్వర్‌రెడ్డి ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో కాలేజీలోని రీడింగ్ రూమ్‌లో చదవడం ముగించుకుని.. వసతిగృహానికి బుల్లెట్ బండి (ద్విచక్రవాహనం)పై బయల్దేరాడు. కళాశాల గేటు దాటి బయటకు రాగానే పెట్రోల్ బంక్ దాటిన తర్వాత అదే రోడ్డులో నందికొట్కూరు నుంచి కర్నూలుకు వేగంగా వస్తున్న పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. కిందపడిన తేజేశ్వర్‌రెడ్డిని దాదాపు 50 మీటర్ల వరకు బస్సు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో తేజేశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీకి తరలించారు. మధ్యాహ్నం తల్లిదండ్రులు రావడంతో పోలీసులు పంచనామా చేసి మృతదేహాన్ని అప్పగించారు. చదువు పూర్తయ్యాక పెద్ద డాక్టర్ అయి తమకు అండగా ఉంటాడని భావించిన ఆ తల్లిదండ్రులు.. కుమారుని మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. 20 రోజుల కిందటే కుటుంబ సమేతంగా తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకుని వచ్చారు. ఇంతలోనే ఎంత ఘోరం జరిగిపోయిందంటూ బంధువులు, స్నేహితులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనతో పిల్లిగుండ్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు విద్యార్థి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సాయి బోధనలే సన్మార్గానికి సోపానాలు



'హృదయ భూమిని సాగు చేయండి' నాటికలో ఒక ఘట్టం

ప్రశాంతి నిలయం: సత్యసాయి బోధనలే మానవుడి సన్మార్గ పయనం, ఆత్మ సంతృప్తికి మార్గమనే సందేశంతో నిర్వహించిన నాటిక భక్తులను అలరించింది. రెండు రోజుల పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేసిన అనంతపురం జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతపురం సత్యసాయి యూత్ 'సాయి దర్శన్' పేరుతో నిర్వహించిన సంగీత కచేరీతో భక్తులు మైమరిచిపోయారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో 'హృదయ భూమిని సాగు చేయండి' పేరుతో నాటిక ప్రదర్శించారు. సత్యసాయి బోధనలు మానవులను సన్మార్గంలో నడిపించేందుకు ఎలా ఉపకరిస్తాయో వివరించారు. సాయి మార్గంలో నడవడం ద్వారా మనిషి ఎలా పరిపూర్ణుడవుతారో కళ్లకు కట్టారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన



'సాయి దర్శన్' సంగీత కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

బాలింతలపై చిన్నచూపు

- పట్టించుకోని సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులు



ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో బాలింతల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు



ఖాళీగా ఉన్న కాలిన రోగుల వైద్య విభాగ భవనం

అనంతపురం మెడికల్: స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రి అధికారుల అలసత్వం బాలింతలకు శాపంగా మారింది. ఆరు బయట షెడ్డులో బాలింతలకు సేవలందించే దయనీయ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గైనిక్ విభాగంలో నాలుగు యూనిట్లు ఉన్నాయి. వీటిల్లో 160 మంచాలు ఏర్పాటు చేశారు. 220 నుంచి 240 మందికి సేవలందిస్తున్నారు. అయితే, గతంలో ఆస్పత్రిలో మంచాల కొరత చూపుతూ అప్పట్లో సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ రఘునందన్ ముందుచూపు లేకుండా ఆరు బయట షెడ్డు ఏర్పాటు చేసి అందులో బాలింతలను ఉంచేలా నిర్ణయం తీసుకున్నారు. షెడ్డులో ప్రస్తుతం 40 నుంచి 50 మంది బాలింతలకు సేవలందిస్తున్నారు. ఆరుబయట కావడంతో బాలింతలకు ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం లేకపోలేదు. పురుషులు అధికంగా తిరుగుతుండడంతో షెడ్డులో బాలింతలు అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై ఇటీవల స్టాఫ్ నర్సులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఆరోగ్యంతో ఆటలు..

సర్వజనాస్పత్రిలో బాలింత ఆరోగ్యం పట్ల చిన్న చూపు ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఓ బాలింత ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి రాగా, ఆమెకు గైనిక్ వార్డులో సేవలందించాల్సిన డాక్టర్లు.. సదుపాయాలు లేవంటూ ఏఎంసీకి తీసుకొచ్చారు. వాస్తవంగా అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ) యూనిట్‌లో విషం తాగిన వారు, పాముకాటు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ప్రాణాంతక కేసులకు సేవందిస్తుంటారు. ఇటువంటి ప్రాంతంలో బాలింతలు, గర్భిణులను ఉంచి సేవలందించకూడదన్న నిబంధన ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. ఆస్పత్రిలో వందకుపైగా వెంటిలేటర్లు, పల్స్ ఆక్సీమీటర్లు తదితర పరికరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఆస్పత్రిలో అనువైన ప్రాంతంలో 5 నుంచి 10 పడకలు ఏర్పాటు చేసి, సదుపాయాలను సమకూర్చి గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించవచ్చు. కానీ ఆ దిశగా ఆస్పత్రి ఉన్నతాధికారులు ఆలోచించడం లేదు. అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతమని ఏఎంసీకి తీసుకెళ్తున్నారు. ఇక.. కొత్తగా ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన బర్న్స్ (కాలిన రోగుల వైద్య విభాగం) వార్డును రెండేళ్లుగా వినియోగించడం లేదు. అది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే వరకు బాలింతలను అక్కడ ఉంచి సేవలందించే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని సిబ్బందే అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో బాలింతల కోసం షెడ్డు ఏర్పాటు చేసేలా గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఆ సమయంలో నేను ఇక్కడ లేను. బాలింతలు ఇబ్బందులు పడకుండా మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

భార్యను తీసుకొస్తానని బయలుదేరి..


మృతుడు తిరుపాల్‌రెడ్డి

యల్లనూరు/పెద్దపప్పూరు: యల్లనూరు మండలంలోని పాతపల్లికి చెందిన వెన్నపూస తిరుపాల్‌రెడ్డి (53) గుండెనొప్పితో మృత్యువాత పడినట్లు బంధువులు తెలిపారు. తిరుపాల్‌రెడ్డి స్వగ్రామం పాతపల్లి. మూడెకరాల పొలం ఉండటంతో వ్యవసాయం నిమిత్తం కుటుంబాన్ని వెన్నపూసపల్లి గ్రామానికి మార్చాడు. ఇదిలా ఉండగా తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో భార్య సరస్వతమ్మకు గర్భసంచి ఆపరేషన్ చేయించి ఈయన ఒక్కడే వెన్నపూసపల్లికి వచ్చాడు. ఆదివారం ఉదయం తన భార్యను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసుకొని తీసుకొస్తానని తన స్నేహితులకు చెప్పి బయల్దేరాడు. తాడిపత్రి నుంచి నాయనపల్లి వరకూ బస్సు టికెట్ తీసుకున్నాడు. అంతలోనే ముచ్చుకోట గ్రామ సమీపంలోని కనుమ దగ్గర మృత్యువాత పడ్డాడు. మూడు నెలల కిందట తిరుపాల్‌రెడ్డికి గుండెకు ఆపరేషన్ చేశారని, గుండె నొప్పితో చనిపోయింటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య సరస్వతమ్మ, కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఇద్దరికి వివాహాలు చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సరస్వతి భర్త మృతి చెందాడని తెలుసుకొని కన్నీరు మున్నీరుగా విలపించింది. పెద్దపప్పూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల అస్వస్థతపై విచారణ


మదరసా పరిసరాల్లో శుభ్రత చర్యలు చేపట్టిన దృశ్యం

రాయదుర్గంటౌన్: ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో సీజనల్, మలేరియా, విష జ్వరాలు బారిన ప్రజలు పడకుండా క్షేత్రస్థాయి నివారణ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా మలేరియా నివారణ అధికార ఓబులు తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని జామియా మహమ్మదయ అరబిక్ కళాశాల మదరసా విద్యార్థులు డయేరియా, విషజ్వరాలు పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం విద్యార్థులంతా పూర్తిస్థాయిలో కోలుకోని డిశ్చార్జ్ అయ్యారు. ఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులుతోపాటు సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు అజహర్‌ఖాన్, ఆరోగ్య సెక్రటరీలతో కలిసి ఆదివారం మదరసాను సందర్శించి విచారించారు. కోలుకున్న విద్యార్థులతో పాటు అక్కడ ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు, నిర్వాహకులతో మాట్లాడారు. వంట గదితో పాటు పరిసరాలను పరిశీలించారు.

డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జార్జ్

అనంతపురం ఎడ్యుకేషన్: డీటీఎఫ్ (డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి జిల్లాకు చెందిన జార్జ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రెండు రోజుల కిందట విజయవాడలో డీటీఎఫ్ 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జార్జ్‌ను ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జార్జ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల జిల్లా బాధ్యులు పురుషోత్తం, చాంద్ బాషా, సుభాన్, కృష్ణ, దౌలత్ ఖాన్, శివ శంకర్ రెడ్డి, మంజుల, కాశమ్మ, సుజాత, తేజ, సరోజినీ, ధనలక్ష్మి, కవిత డానియల్ విజయ్ హర్షం వ్యక్తం చేశారు.

ఖర్చుల 'గుబులు'

- పేద, మధ్యతరగతి కుటుంబాలకు 'జూన్' టెన్షన్
- విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండటంతో తల్లిదండ్రులపై ఫీజుల భారం
- వ్యవసాయ పెట్టుబడులు, బ్యాంకు రుణాల రెన్యూవల్స్‌తో అన్నదాతల ఆందోళన
- అన్ని ఖర్చులు ఒకేసారి రావడంతో సతమతం





హిందూపురం అర్బన్: పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చుల గుబులు నెలకొంది. 11 నెలల పాటు ఏదో ఒక విధంగా నెట్టుకొచ్చిన ఆయా కుటుంబాలు జూన్ మాసం వచ్చిందంటేనే చాలు ఆందోళన చెందుతున్నాయి. నెలరోజులపాటు వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతుండగా, వారి తల్లిదండ్రులు మాత్రం ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ఆలోచన చేస్తున్నారు. మరోవైపు పొలం బాట పట్టే సమయం కావడంతో అన్నదాతలకు పెట్టుబడి ఖర్చులు, బ్యాంకు రుణాల రెన్యూవల్ టెన్షన్ పట్టుకుంది.

పంట పెట్టుబడులు ఎలాగో..

నైరుతి రుతుపవనాల రాకతో జిల్లా వ్యాప్తంగా జోరుగా వర్షాలు పడుతున్నాయి. కుంటలు, చెక్ డ్యాములు నీటితో కళకళలాడుతున్నాయి. బోర్లు కూడా రీచార్జ్ అయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా సకాలంలో రైతులకు విత్తన పంపిణీకి చర్యలు తీసుకుంది. దీంతో అన్నదాతలు వ్యవసాయంపై దృష్టిసారించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో 2.22 లక్షల మందికి పైగా రైతులు ఉండగా దుక్కులు ఎక్కువ మంది చేసుకునేందుకు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. విత్తనం, ఎరువుల ఖర్చులు కూడా అధికంగా ఉన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకూ వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయంగా అర్హత ఉన్న ప్రతి రైతుకు ఏటా రూ.13,500 సాయం అందిస్తూ వచ్చింది. ఇది సాగు అవసరాలను ఎంతగానో పనికొచ్చేది. తాజాగా సార్వత్రిక ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువు తీరడంతో సాగు పెట్టుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలోలాగానే ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తుందేమోనని మదన పడుతున్నారు. అవసరమైన సమయంలో బ్యాంకుల్లో రుణం అందక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందేమోనని భావిస్తున్నారు. దీనికి తోడు బ్యాంకుల్లో రుణాల రెన్యూవల్ ఖర్చు కూడా ఒకేసారి రావడంతో డబ్బుల కోసం ఆలోచన చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

భారంగా మారిన స్కూల్ ఫీజులు

పిల్లల చదువులకు ఖర్చులు ఏటికేడాది విపరీతంగా పెరుగుతున్నాయి. కుటుంబం నుంచి బాలుడు, బాలికను ప్రైవేట్ పాఠశాలలకు పంపాలంటే ఫీజులు, దుస్తులు, షూస్, పుస్తకాలు, బ్యాగులు, ఇతర సామగ్రితో పాటు రవాణా చార్జీలకు రూ.వేలల్లో చెల్లించాల్సి వస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి పుస్తకాలు, పెన్నులు, నోట్‌బుక్‌ల తదితర వాటిపై 10 శాతం ధరలు పెరిగాయి. ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకూ వేలల్లో ఫీజులు కట్టాల్సి వస్తోంది. ఇక హాస్టల్ ఉంటే అదనపు బాదుడు తప్పడం లేదు. ఇక కళాశాల, ఇంజనీరింగ్ చూస్తే లక్షల్లోనే ఖర్చు పెట్టక తప్పదు. ఇందుకోసం ఎక్కువ మంది తల్లిదండ్రులు అప్పులకు సిద్ధమవుతున్నారు.

స్కూళ్ల నుంచి ఒత్తిడి మొదలైంది



మాకు ఇద్దరు పిల్లలు. హిందూపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాను. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మఒడి ద్వారా అందించే రూ.15 వేలకు తోడు కొంత నగదు చేతి నుంచి వేసుకుని పిల్లలను చదివించే వాళ్లం. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు సకాలంలో పిల్లలకు ఫీజు చెల్లిస్తారా? లేదా? అన్న భయం ఉంది. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామన్నారు. ఆ డబ్బులు ఎన్నడిస్తారో చూడాలి మరి. స్కూళ్ల నుంచి మాత్రం అప్పుడే ఫీజు గురించి ఒత్తిడి మొదలైంది. – **లలితమ్మ, చిలమత్తూరు**

రైతుకు అన్నీ ఖర్చులే...



రైతులు పొలాలు దుక్కులు చేసుకోవడం, విత్తనాలు కొనడం, ఎరువులు కొనడం ఇలా అన్నింటిపై రైతులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రతి ఏటా పంటసాగు ఖర్చులు పెరుగుతున్నాయి. ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.13,500 పంట పెట్టుబడి సాయం అందించింది. కొలువు దీరుతున్న నూతన ప్రభుత్వం కూడా రైతులకు సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. పెట్టుబడి సాయం త్వరగా అందించి అందరినీ ఆదుకోవాలి.

– **ఈశ్వర్‌రెడ్డి, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం**

నృసింహుడి సేవలో కలెక్టర్


పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్ దంపతులు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని కుటుంబ సమేతంగా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో వారికి ఘనంగా స్వాగతం పలికారు. మొదట కలెక్టర్ దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు బాలాజీస్వామి పెన్నహోబిళం ఆలయ విశిష్టతను కలెక్టర్‌కు వివరించారు.

పీఈటీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసులు

అనంతపురం ఎడ్యుకేషన్: అపరిష్కృతంగా ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు కేశవమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా రాష్ట్రం, కేంద్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. 2024- 25 అకడమిక్ క్యాలెండర్‌లో పాఠశాల క్రీడలు, వ్యాయామ విద్య ప్రాధాన్యతపై చర్చించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇన్‌సర్వీస్‌లో బీపీఈడీ చేసేందుకు ఓసీ, బీసీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ఓ. నరసింహారెడ్డి, ప్రభాకర్, జిల్లా నాయకులు పక్కీరప్ప, సునీత, రాజశేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'జేఈఈ అడ్వాన్స్‌డ్' లో ప్రతిభ


శశికిరణ్


మేఘన


మోహన్‌ప్రదీప్


సిద్ధార్థరెడ్డి


ముజమ్మిల్


కె.సాయి హనీష్‌రెడ్డి


ఎస్.చక్రధర్‌రెడ్డి


సాయిగౌతమ్

అనంతపురం ఎడ్యుకేషన్: దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటీ కళాశాలల్లోని ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్-2024 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం ఉదయం ఫలితాలు విడుదలయ్యాయి. దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలతో పాటు పలు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించనున్నారు. జాయింట్ సీట్ అలికేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లను భర్తీ చేయనుంది. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రైతు పాలగిరి లక్ష్మీరెడ్డి కుమారుడు పాలగిరి సతీష్‌రెడ్డి 360 మార్కులకు 285 మార్కులు సాధించి దేశస్థాయిలో ఓపెన్ కేటగిరీలో 175 ర్యాంకులో నిలిచాడు. దీంతో సతీష్‌రెడ్డిని పలువురు అభినందించారు. తమ కుమారుడు ఈస్థాయి ర్యాంకు సాధించడం గర్వంగా ఉందని తల్లిదండ్రులు, బంధువులు పేర్కొన్నారు. అలాగే జి. శశికిరణ్ 234 మార్కులు సాధించి ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 982 ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్ లోనూ ఓపెన్ క్యాటగిరీలో 1,830, తెలంగాణ ఎంసెట్‌లో 437 ర్యాంకు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో అనంతపురం నగరానికి చెందిన షేక్ ముజమ్మిల్ ప్రతిభ చాటాడు. ఆలిండియా జనరల్ కేటగిరీలో 823వ ర్యాంకు సాధించాడు. ఆ విద్యార్థి తల్లిదండ్రులు డి.నజత్‌కౌషర్, కలీముల్లా ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరితో పాటు సి. మేఘన 4,124 ర్యాంకు, జి. మోహన్‌ప్రదీప్ 4,657 ర్యాంకు, అజయ్ కృష్ణారెడ్డి 5,287, సిద్ధార్థరెడ్డి 16,145, అసిమ్‌ఖాన్ 17,929 అఖిల భారత ర్యాంకులు సాధించారు. వివిధ కేటగిరీల్లో జి. దీపిక 2,241 ర్యాంకు, డి. స్తుతి ప్రశంసిని 3,713, పి. రేణుక 4,658 ర్యాంకులు సాధించి అర్హత సాధించారు.


ఓపెన్ కేటగిరిలో 175 ర్యాంకు సాధించిన సతీష్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

ఎంఈఓ కుమారుడికి...

శింగనమల ఎంఈఓ శివప్రసాద్ కుమారుడు జి.సాయిగౌతమ్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రాణించాడు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 204 ర్యాంకు సాధించాడు. విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సాయిగౌతమ్‌కు అభినందనలు తెలిపారు.

తాడిపత్రి అర్బన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తాడిపత్రికి చెందిన కె.సాయి హనీష్‌రెడ్డి, ఎస్.చక్రదర్‌రెడ్డి ఆల్‌ఇండియా స్థాయిలో ర్యాంకులు కైవసం చేసుకుని ప్రతిభను కనబరిచారు. కె.సాయి హనీష్‌రెడ్డి 278 మార్కులతో ఆల్‌ఇండియా స్థాయిలో 233వ ర్యాంకు సాధించాడు. అలాగే ఎస్.చక్రధర్‌రెడ్డి 206 మార్కులతో 2059 ర్యాంకును సాధించాడు. దీంతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు అభినందించారు.

వైభవంగా సీతారామ పట్టాభిషేకం

ఉరవకొండ: విడపనకల్లు మండల పరిధిలోని పాలికిలో వెలసిన సీతారామ స్వామి ఆలయంలో స్వామి వారి మహాసామ్రాజ్య పట్టాభిషేక కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. సీతారామస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం నిర్వహించి స్వామివార్లను హనుమంత వాహనంపై ఊరేగించారు. తర్వాత శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.


హనుమంత వాహనంపై సీతారాములు

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న రామాంజనేయులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా, న్యాయబద్ధమైన సమస్యలపై ఎస్టీయూ పోరాటాలు చేస్తోందన్నారు. రాష్ట్ర నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం 117, 128 జీఓలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శివయ్య చారి, సురేష్ కుమార్, పూర్వ జిల్లా అధ్యక్షుడు రామన్న, గోవిందు, జిల్లా నాయకులు శ్రీనివాసులు, రాజశేఖర్, కిషోర్ కుమార్, రామకృష్ణ, విరుపాక్షి గౌడ్, కృష్ణమూర్తి నాయుడు, మల్లికార్జున, నాగభూషణం, వీరాంజనేయులు, రామకృష్ణ, రామాంజనేయులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఏడుగురి బలవన్మరణం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకేరోజు వివిధ కారణాలతో ఏడుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనారోగ్యం, కుటుంబ కలహాలు, అప్పుల బాధ, ప్రేమ విఫలం తదితర కారణాలతో తనువు చాలించారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి.

- బాధిత కుటుంబాల్లో విషాదం











మృతులు చాకల మద్దిలేటి, గొల్ల గిడ్డప్ప, వేణుగోపాల్‌రెడ్డి, సోమశేఖర్ (ఫైల్), ముఖేష్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

యాడికి: అనారోగ్య కారణాలతో మద్దిలేటి (75) అనే వృద్ధుడు బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుడిపాడులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... గుడిపాడుకు చెందిన చాకలి నందవరం మద్దిలేటికి రామాంజనేయులు, రాజు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నాయి. 20 ఏళ్ల క్రితమే ఆయన భార్య, 15 ఏళ్ల క్రితం పెద్ద కుమారుడు రామాంజినేయులు చనిపోయాడు. రెండేళ్లుగా ఆయాసం ఎక్కువ వడంతో పలు ఆస్పత్రుల్లో మద్దిలేటి చికిత్స చేయించుకున్నాడు. నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలోని బావిలోకి దూకాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యు లకు సమాచారం అందించారు. బావిలోకి పడిన మద్దిలేటిని బయటకు తీసుకురాగా అప్పటికే అతను మృతి చెందాడు. చిన్న కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

పుట్లూరు: మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన అరటి వ్యాపారి ముఖేష్‌కుమార్‌రెడ్డి (27) యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలమేరకు.. ముఖేష్‌కుమార్‌రెడ్డి అరటి కాయల వ్యాపారం చేస్తూ ఓ ప్రైవేట్ కంపెనీ ద్వారా ఇతర దేశాలకు అరటిని ఎగుమతి చేసేవాడు. కొన్నేళ్లుగా రైతులకు సకాలంలో డబ్బు చెల్లిస్తుండటంతో వ్యాపారం సజావుగా సాగేది. అయితే కంపెనీ నుంచి రావాల్సిన డబ్బు ఆలస్యం కావడంతో అరటి పండ్లను అమ్మిన రైతులు డబ్బు కోసం ఒత్తిడి పెరిగింది. దీంతో శనివారం బాత్‌రూం క్లీనింగ్ కోసం వినియోగించే యాసిడ్‌ను తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆదివారం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని చెలిమేపల్లి గొల్లలదొడ్డి గ్రామంలో కుటుంబ సమస్యలతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... గొల్ల గిడ్డప్ప (58) తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటీన రాయదుర్గం ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్య మార్గంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బ్రహ్మసముద్రం ఎస్ఐ పరుశురాముడు తెలిపారు.

సోమందేపల్లి: మండలంలోని బుసయ్యగారిపల్లిలో కుటుంబ కలహాలతో గొల్ల సోమశేఖర్(45) ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వెలుగు చూసింది. తన కుమార్తెకు పెళ్లి సంబంధం కుదిరింది. అయితే ఇదే గ్రామానికి చెందిన మరో యువకుడితో ఆమె వెళ్లిపోయింది. దీంతో తీవ్ర వేదనకు గురైన సోమశేఖర్ శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమార్తెను పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకున్న వారిని సమాధానం చెప్పలేక సోమశేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఈరంగమ్మతో పాటు కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మురళి తెలిపారు.

అమడగూరు: ప్రేమించిన యువతి తనకు దక్కలేదని మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అమడగూరు మండలం జౌకల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మగ్బూల్‌బాషా వివరాల మేరకు.. జౌకలకు చెందిన బొంత వేణుగోపాల్‌రెడ్డి (20) అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. అయితే ఆ యువతికి గత పది రోజుల క్రితమే వేరే అతనితో వివాహమైంది. విషయం తెలుసుకున్న వేణుగోపాల్‌రెడ్డి తను ప్రేమించిన మనిషి తనకు దక్కలేదన్న ఆవేదనతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల్లో ఓటమిని భరించలేక...

కళ్యాణదుర్గం: మండలంలోని మంగళకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురబ నాగరాజు (38) అనే వ్యక్తి వైఎస్సార్‌సీపీకి వీరాభిమాని. ఇటీవల ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం తన వ్యవసాయ పొలంలో వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య జ్యోతి, కుమారుడు (7) ఉన్నారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎగువ తండాలో మరొకరు..

కళ్యాణదుర్గం మండలంలోని ఎగువ తండా గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రమావత్ చందునాయక్ (35) తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలవడంతో జీర్ణించుకోలేక పోయాడు. దీనికి తోడు గ్రామంలో టీడీపీ కార్యకర్తలు అనే మాటలకు తట్టుకోలేక అవమానంగా భావించాడు. ఈ నేపథ్యంలో తన భార్య భానుబాయిని పుట్టింటికి పంపి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు (7) ఉన్నారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.


రమావత్ చందు నాయక్ (ఫైల్)

క్లుప్తంగా

సంతల ఆదాయం రూ.5.18 లక్షలు


సంతలో గొర్రెల క్రయవిక్రయాలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.5.18 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. సంతల ద్వారా రూ.5 లక్షలకు పైగా వసూలు కావడం ఇదే మొదటి సారి అన్నారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత నుంచి రూ.2,36,050 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, గేదెలు, ఎద్దుల సంత ద్వారా రూ.2,82,300 వసూలైనట్లు తెలిపారు. బక్రీదు పండుగ నేపథ్యంలో ఈ వారం సంతల్లో క్రయ విక్రయాలు జోరుగా సాగినట్లు పేర్కొన్నారు.

15న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

రాప్తాడు: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 15న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ పద్మజా దేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని వెల్లడించారు. 7వ తరగతిలో 48, 8వ తరగతిలో 35, 9వ తరగతిలో 15 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పై తరగతులతో పాటు ఇంటర్‌లో ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో చేరదలిచిన విద్యార్థులు ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కళాశాల పని వేళల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులకు ఈనెల 15న పరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రషీద్ సేవలు మరువలేనివి


ప్రార్థనలు చేస్తున్న ఆల్‌మేవా కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: మైనారిటీ ఉద్యోగ వర్గాలకు ఆల్ మైనారిటీ వేల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ రషీద్ అందించిన సేవలు మరువలేనివని సంఘం ఉమ్మడి జిల్లా కోర్ కమిటీ సభ్యులు కొనియాడారు. ఆదివారం స్థానిక ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రషీద్‌కు సంతాపసభ నిర్వహించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలంటూ దువా చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు షేక్షావలి, ఫారూఖ్ అహమ్మద్ మాట్లాడారు. ఆల్‌మేవా బలోపేతానికి మైనారిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రషీద్ ఎంతగానో కృషి చేశారన్నారు. ముస్లిం రిజర్వేషన్ల సాధన ఉద్యమంలో రషీద్ ప్రముఖపాత్ర పోషించారన్నారు. సామాజిక కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలిచారని వెల్లడించారు. గిరిజన సంక్షేమ అధికారిగా చిత్తూరు, పాడేరు, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 1999లో అవార్డు ప్రదానం చేసిందని గుర్తు చేశారు. ఈనెల 3న నల్గొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో రషీద్ గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కాలగాలని అల్లాను ప్రార్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫక్రుద్దీన్, ఏఎంబాషా, దొరాల, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పోతలయ్య స్వామికి పూజలు


అలంకరణలో పోతలయ్య స్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్య స్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని పోతలయ్య, చెన్నేకేశవస్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆంజనేయుడికి పూజలు

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామ సమీపంలో వెలసిన 39 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేసినట్లు నిర్వాహకుడు ఈశ్వరయ్య స్వామి తెలిపారు.


అనంతపురంలో జోరుగా కురుస్తున్న వర్షం


వ్యవసాయ పనులకు వెళ్తున్న కూలీలు

తెరిపివ్వని వరుణుడు

అనంతపై వరుణుడు కరుణ చూపుతున్నాడు. గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం నగరంలోని పలుచోట్ల జోరువాన కురిసింది. ఉదయం నుంచి దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. ఆకాశం మేఘావృతం కావడంతో చల్లని గాలులు వీచాయి. మధ్యాహ్నం, సాయంత్రం కురిసిన వర్షానికి పలుచోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


గొడుగు సహాయంతో ఇలా..


ఇస్కాన్ టెంపుల్ వద్ద కమ్ముకున్న దట్టమైన మేఘాలు


వర్షంలోనే తడుచుకుంటూ వెళ్తున్న మహిళలు

రైతుతోనే సమాజ ప్రగతి


ఈశ్వరీ గోపాలరావు దంపతులకు సన్మానం

అనంతపురం కల్చరల్: రైతుతోనే సమాజ ప్రగతి పథమని జనప్రియ కవి ఏలూరు యంగన్న అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ రచయిత మార్తాటి ఈశ్వరీ గోపాలరావు రచించిన 'రైతే మా రాజు' పుస్తకావిష్కరణ జరిగింది. స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరిగిన కార్యక్రమానికి ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. యంగన్న కవితో పాటూ పుస్తక సమీక్షకుడు రాజారామ్, ప్రముఖ రంగస్థల నటుడు సి.రాము ఆత్మీయ అతిథులుగా హాజరై, మాట్లాడారు. కావ్యం నిండా నిరంతరం కష్టపడే రైతు జీవితం, మట్టి వాసన, పల్లెటూరు సోయగాలు, రైతుతో ముడిపడిన వ్యవసాయ ప్రాధాన్యత కనపడతాయన్నారు. అందరూ చదవదగిన కావ్యంగా అభివర్ణించారు. రైతు నూతన సాంకేతిక వ్యవసాయంలో నవీన పద్ధతులు పాటించాలని రచయిత కోరుకున్నారని తెలిపారు. రైతే మారాజు కావ్యంలో పశు సంపదే దేశ సంపదగా కవి కీర్తించారని గుర్తు చేశారు. అనంతరం కవి మార్తాటి గోపాలరావు దంపతులను పలువురు రచయితలు, కవులు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర, సీనియర్ రచయితలు తరిమెల అమరనాథరెడ్డి, గోవిందరాజులు, టీవీ రెడ్డి, అశ్వర్థరెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఎం బాషా, పూజారి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

నమాజ్‌తోనే మానసిక ప్రశాంతత


ప్రసంగిస్తున్న మహిళా ముల్లిమాలు

అనంతపురం కల్చరల్: ప్రతి బిడ్డ అమ్మ ఒడి ప్రథమ పాఠశాలగా జ్ఞానాన్ని సంపాదించుకుంటుందని పలువురు మహిళా ముల్లిమాలు అన్నారు. ఆదివారం తెహరికె ఫైజానే ఉమర్ ఫారూఖ్ వారి ప్రథమ వార్షిక మహిళా సున్ని ఇజ్‌తెమా ఘనంగా జరిగింది. తెహరీక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజాఖాద్రి నేతృత్వంలో స్థానిక రాణీనగర్‌లోని బహామీ బైతుల్ మాల్ షాదీ మహల్ వేదికగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా ముల్లిమాలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ప్రతి స్త్రీ కుటుంబం మంచి మార్గంలో నడవడానికి తన శక్తియుక్తులన్నీ వినియోగిస్తుందన్నారు. బిడ్డల సత్ప్రవర్తన తల్లితోనే సాధ్యమని వెల్లడించారు. రోజూ ఐదు సార్లు నమాజ్ చేస్తే మానసిక ప్రశాంతత తోడై ఉన్నత జీవితం అనుభవించడానికి సాధ్యమవుతుందన్నారు. పవిత్ర ఖురాన్‌లోని ముఖ్య విషయాలను ప్రతి స్త్రీ తాను నేర్చుకుని.. బిడ్డలను ఆ బాటలో నడిపించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మధ్యాహ్నం ప్రత్యేక వసతులతో పాటూ భోజన సౌకర్యం కల్పించారు. ఇకపై ప్రతి ఏటా మహిళా ఇజ్‌తెమా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మసీద్ ముతవల్లి ఫరుదీద్దున్, సెక్రటరీ పర్వేష్, షబ్బీర్ అహమద్, అబ్దుల్ సమీ, హబీబ్, డాక్టర్ షఫీ, ఆరిఫ్, చాంద్ బాషా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకెళ్లాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ డాక్టర్ వినూత్న

అనంతపురం మెడికల్: హిమోఫీలియాతో బాధపడుతున్న వారు మనోస్థైర్యాన్ని కోల్పోకుండా ముందుకెళ్లాలి. తల్లిదండ్రులు ఆ దిశగా పిల్లల్లో ధైర్యం నింపాలని అసిస్టెంట్ కలెక్టర్ డాక్టర్ వినూత్న పేర్కొన్నారు. ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాల్‌లో హిమోఫీలియా బాధితులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హిమోఫిలియాతో బాధపడే వారు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అందుకు సంబంధించిన మందులు పుష్కలంగా ఉన్నాయని గుర్తు చేశారు. ప్రధానంగా జీవితంలో ప్రతి ఒక్కరూ పాజిటివ్ దృక్పథంతో ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వ పరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీని (ఎమర్జెన్సీ) ఎమర్జెన్సీ మెడిసిన్‌గా మార్చుతున్నట్లు వెల్లడించారు. హిమోఫీలియా బాధితులకు అక్కడే ఫ్యాక్టర్ ఇంజెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌టాస్ ఫౌండేషన్ ప్రతినిధులు రామకృష్ణ, నారాయణస్వామి, శ్యాంసుందర్, కృష్ణమూర్తి, గణేష్, చిక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

• ఆదమరిస్తే ప్రమాదమే..


చెన్నేకొత్తపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పడిన గొయ్యి

చెన్నేకొత్తపల్లి వద్ద ఉన్న వంకపై నిర్మించిన 44 నంబర్ జాతీయ రహదారి వంతెనపై ప్రమాదం పొంచి ఉంది. కొన్ని నెలల క్రితం వంతెన సేఫ్టీవాల్‌కు పక్కన చిన్న గొయ్యి ఏర్పడింది. పైకి చిన్న గొయ్యిగా కనిపించినా లోపల రెండు నుంచి మూడు అడుగుల వెడల్పు గోతి ఏర్పడింది. దీనిని గమనించని పెద్ద వాహనాలు అటుగా వెళితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రహదారిపై మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

– చెన్నేకొత్తపల్లి:

స్థానిక చరిత్రల అధ్యయనం ఉపయుక్తం


నొళంబవాడి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అనంత రచయితలు

అనంతపురం కల్చరల్: నొళంబుల చరిత్రను రికార్డు చేయడం ఒక సాహసోపేతమైన ప్రయత్నమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి కొనియాడారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సిద్ధగిరి శ్రీనివాస్ రచించిన 'నొళంబవాడి' పుస్తక పరిచయ సభ జరిగింది. జిరసం అధ్యక్షుడు డాక్టర్ జెన్నే ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బండి నారాయణ స్వామి, సత్యసాయి జిరసం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, అడవాళ శేషగిరి నాయుడు, బండి నాగరాజు, పోతుల రాధాకృష్ణ, పుస్తక సమీక్షకుడు డాక్టర్ అంకె శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. మడకశిర ప్రాంతానికి చెందిన రచయిత సిద్ధగిరి శ్రీనివాస్ తన స్థానిక చరిత్రను రికార్డు చేయడంలో సఫలీకృతులయ్యారన్నారు. చరిత్ర అధ్యయనం కుంటుపడుతుండటం విచారకరమన్నారు. సునిశితమైన పరిశీలన జ్ఞానం గొప్ప పుస్తకానికి తొలి మెట్టుగా మారిందని రచయితను పలువురు కొనియాడారు. అదేవిధంగా సిద్ధగిరి శ్రీనివాస్ ఆసక్తికరమైన జిల్లా చరిత్ర విశేషాలను తెలియజేసి ఆకట్టుకున్నారు. ఒక మహా సామంత రాజ్యపు చరిత్రను వివరించారు. జిరసం కార్యవర్గంతో కలిసి ఎల్కేపీ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, అమరనాథరెడ్డి, వన్నప్ప, నబీరసూల్, రియాజుద్దీన్, షరీఫ్, చేగువేరా హరి, ఆలీఖాన్ తదితరులు రచయితను ఘనంగా సత్కరించారు.

పంపనూరులో భక్తుల సందడి


ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో సుబ్రహ్మణ్యేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆకుపూజ అనంతరం స్వామికి మహా మంగళహారతి అందించారు. అంతేకాకుండా స్వామి బంగారు కవచాన్ని మేళతాళలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయంలో కాల సర్పదోష నివారణకు రాహుకేతు హోమాలు చేశారు. అలాగే ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. వేసవి సెలవులు కావడంతో ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. భక్తులు మొక్కుబడిగా ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. స్వామి దర్శనానికి గంటల సమయం పట్టింది. భక్తులకు ఆలయంలో తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నల్లలమ్మ ఆలయంలో పూజలు

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో వెలసిన నల్లలమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

చల్లగా చూడు యల్లమ్మ తల్లీ


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని జీసెస్ నగర్‌లో రేణుకా యల్లమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం కనుల పండువగా జరిగాయి. గత మూడు రోజులుగా సందడిగా సాగుతున్న వేడుకల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. వందలాది మంది భక్తుల శరణుఘోష నడుమ అమ్మవారికి విశేష అలంకారం, అభిషేకాలు చేపట్టారు. ఆలయ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా 108 శ్రీసూక్తములను పఠించారు. పెద్ద ఎత్తున కుంకుమతో అభిషేకం, అనంతరం మహాపూర్ణాహుతిని వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. మహిళలు బారులు తీరి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై రాత్రి దీపాల వెలుగుల్లో గ్రామోత్సవం వేడుకగా సాగింది. సాంస్కృతిక సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మెరుగ్గా అల్ట్రాసౌండ్ సేవలు


రోగికి అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తున్న వైద్యురాలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రేడియాలజీ విభాగంతో రోగులకు మెరుగ్గా అల్ట్రాసౌండ్ సేవలు అందుతున్నాయి. ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ సెంటర్‌లో రోజూ 80 మందికి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 20 మందికి పైగా రోగులకు అల్ట్రాసౌండ్ సేవలు అందిస్తున్నారు. జీజీహెచ్‌లోని సెంటర్‌లో మూడు స్కానింగ్ మిషన్లు ఉన్నాయి. అందులో అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు, పీజీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కాన్‌లు చేస్తున్నారు. ఆస్పత్రిలోని గైనిక్, చిన్నపిల్లల, ఐసీసీయూ, ఆర్థో, చెస్ట్, సర్జరీ, ఏఎంసీ, ఎంఎం, ఎఫ్ఎం తదితర వార్డుల నుంచి రోగులకు అబ్డామిన్, పెల్విస్, ఛాతి, పసికందులకు బ్రెయిన్, మోకాళ్లు, కంటికి స్కాన్ చేసి రిపోర్టులు అందజేస్తున్నారు. ఇటువంటి స్కాన్ చేయాలంటే ఒక్కోరికి రూ.1,000 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు అవుతుంది. అటువంటి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉచితంగా అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తుండటంపై రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తగరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఆత్మీయ కలయిక.. ఆనందాల వేడుక

కనగానపల్లి మండలంలోని తగరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. స్థానిక పాఠశాలలో 1991–95 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీరికి విద్యాభ్యాసం చేసిన పలువురు ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం విద్యార్థులంతా ఒకచోట చేరి గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ సందడి చేశారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

– కనగానపల్లి:

గుండెపోటుతో వార్డు మెంబర్ మృతి


దండు శ్రీనివాసులు మృతదేహం

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన బేల్దారి, 8వ వార్డు మెంబర్ దండు శ్రీనివాసులు (48) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. దండు శ్రీనివాసులు గత సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ తరపున 8వ వార్డు మెంబర్‌గా పోటీ చేసి గెలిచారు. గత కొనేళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యవసాయంతో పాటు భార్య ఓసూరమ్మ, పెద్ద కుమారుడు భరత్‌తో కలిసి బేల్దారి పనులకు వెళ్లేవారు. ఆదివారం ఉదయం రాప్తాడుకు చెందిన చర్మాల శ్రీరాముల ఇంటి వద్దకు బేల్దారి పని చేసేందుకు వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పి అక్కడికక్కడే పడిపోయాడు. వెంటనే స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో 108లో అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. దండు శ్రీనివాసులును పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులను సర్పంచు సాకే తిరుపాలు తదితరులు పరామర్శించారు.

బక్రీద్ పొట్టేళ్లకు భలే డిమాండ్

- శనివారం నాటి సంతలో ఒక్కరోజే రూ.20 కోట్ల దాకా వ్యాపారం
- మూడు రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు
- రాష్ట్రంలోనే పొట్టేళ్ల సంతగా బైరెడ్డిపల్లి ప్రత్యేకత

జత రూ.3 లక్షలు పలికిన ధర


వ్యాపారులు, రైతులు, దళారులతో కిటకిటలాడుతున్న బైరెడ్డిపల్లి పొట్టేళ్ల సంత

బైరెడ్డిపల్లి/పలమనేరు(చిత్తూరు జిల్లా) : చిత్తూరు జిల్లాలోని బైరెడ్డిపల్లిలో పొట్టేళ్ల సంతకు ప్రసిద్ధి. ఈ నెల 16న బక్రీద్ పండగను పురస్కరించుకుని ముందస్తుగానే కొందరు మాంసాహారం కోసం పొట్టేళ్లను ఇక్కడకొచ్చి కొనడం ఆనవాయితీ. ఆ మేరకు శనివారం జరిగిన వారపు సంతలో జత పొట్టేళ్లు గరిష్టంగా రూ.3 లక్షల దాకా పలికాయి. సాధారణంగా జత పొట్టేళ్లు రూ.40 వేల దాకా ఉంటాయి. రాష్ట్రంలోనే పొట్టేళ్ల వారపుసంతగా పేరొందిన సంత చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లిలో జరుగుతుంది. ఇక్కడ లభించే నాణ్యమైన, రుచికరమైన పొట్టేళ్ల కోసం మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళల నుంచి వచ్చి వ్యాపారులు పొట్టేళ్లను కొని తీసుకెళుతుంటారు. పండుగకు ముందు సంత కావడంతో పొట్టేళ్లను విక్రయించే రైతులు, కొనే వ్యాపారులతో సంత ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. ఇక వాహనాలైతే మూడు కిలోమీటర్ల మేర బారులుతీశాయి. ముఖ్యంగా కాశ్మీరీ మేకపోతులు, స్థానికంగా పెంచిన పొట్టేళ్లు మాత్రం లక్షల్లో ధరలు పలకడం విశేషం. బక్రీద్ నేపథ్యంలో శనివారం జరిగిన వారపు సంతకు పొట్టేళ్లు, మేకలు, గొర్రెలు సుమారుగా 40 నుంచి 50 వేల దాకా వచ్చాయి. మొత్తం మీద ఇక్కడ పండుగ సంతలో రూ.20 కోట్ల దాకా క్రయ, విక్రయాలు జరిగాయి. వచ్చే శనివారమూ ఇదే స్థాయిలో వ్యాపారం జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

దళారులకు పండగే..

ఇక్కడి పొట్టేళ్ల సంతలో పండుగసంత కావడంతో దళారుల హవా కొనసాగింది. మొత్తం వ్యవహారం చేతిరుమాళ్ల ద్వారా రహస్య వ్యాపారాలతోనే జరిగింది. అటు రైతులు, ఇటు వ్యాపారులకు మధ్య బేరం కుదర్చడంలో దళారులే ఇక్కడ కీలకం. వీరికి ఇరువైపుల నుంచి నిర్ణయించిన మేర కమీషన్లు దక్కుతాయి. కేవలం బక్రీద్ పండుగకు పొట్టేళ్లను పెంచి మంచి ధరలకు అమ్ముకోవడం రైతులకు మంచి ఆదాయంగా మారింది. దీంతో చిత్తూరు, అనంతపురం జిల్లాలు, కర్ణాటకలోని కోలారు, చింతామణి, శ్రీనివాసపురం, మాలూరు జిల్లాల్లో బక్రీద్ పొట్టేళ్ల పెంపకం సాగుతోంది. ఏటా మేలో మంచి పొట్టేళ్ల కోసం రైతుల అన్వేషణ మొదలవుతుంది. కందూరు, సోమల, సదుం, పీలేరు, అంగళ్లు, బైరెడ్డిపల్లె, బంగారుపేట(కర్ణాటక) తదితర ప్రాంతాల నుంచి మంచి గొర్రె పొట్టేళ్లను రైతులు కొనుగోలు చేస్తారు. అప్పటికే వీటి ధర రూ.10 వేల దాకా ఉంటుంది. ఆ తర్వాత వీటిని బాగా సంరక్షిస్తారు. పచ్చిగడ్డితో పాటు బూసా, గానుగపిండి, మొక్కజొన్న తదితరాలను పెట్టి ఏడాది పాటు సాకుతారు. దీంతో బక్రీద్ పండుగకల్లా కొమ్ములు తిరిగిన పొట్టేళ్లు మంచి మాంసంతో సిద్ధమవుతాయి.

ఇక్కడి పొట్టేళ్ల మాంసం చాలా రుచి



నేను బైరెడ్డిపల్లి సంతంలో 30 ఏళ్ల నుంచి బక్రీద్ పొట్టేళ్లను కొంటున్నా. మా ప్రాంతంలో బైరెడ్డిపల్లి పొట్టేళ్లకు భలే డిమాండ్. వీటి మాంసం చాలా రుచిగా ఉంటుంది. ఫారాల్లో మేపే పొట్టేళ్లలో ఈ రుచి రాదు. అందుకే ఇక్కడి కొచ్చి కొంటుంటాం.

– అబ్దుల్ బాషా, గుడియాత్తం, తమిళనాడు

ఇక్కడి పొట్టేళ్లకు భలే డిమాండ్



ఈ ప్రాంతంలోని రైతులు కొండల్లో, బీడు భూముల్లో పొట్టేళ్లను మేపుతుంటారు. దీంతో ఫామ్‌లో ఉండే వాటి కన్నా వీటి శరీరం దృఢంగా ఉంటుంది. దీంతో పాటు రుచి బాగుంటుంది. ఇక మేకలను అటవీప్రాంతంలో మేపుతారు. అవి అడవుల్లోని పలురకాల ఔషధ గుణాలున్న ఆకులను తినడంతో వీటికీ డిమాండ్ ఎక్కువగా ఉంది.

– డా.వేణు, గొర్రెల పరిశోధన కేంద్ర చీఫ్ సైంటిస్ట్, పలమనేరు

విద్యుత్‌శాఖలో వింత ఆచారం

- ఏళ్ల తరబడి ఒకేచోట డిప్యుటేషన్లలో ఉద్యోగులు
- ఏటా ఆనవాయితీగా పొడిగింపు
- ఇకపై ఆ అవసరం కూడా లేకుండా ఆదేశాలు
- ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసులో విచిత్రం
- 35 మంది ఉద్యోగులు ఇక అక్కడే పర్మినెంట్



సాక్షి, అమరావతి: విద్యుత్‌శాఖలో డిప్యుటేషన్లపై పనిచేస్తున్నవారి విషయంలో ఆ శాఖ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం ఉద్యోగవర్గాల్లో సంచలనం సృష్టించింది. డిప్యుటేషన్‌పై వచ్చినవారు శాశ్వతంగా అక్కడే పనిచేసేలా జారీచేసిన ఈ ఉత్తర్వులు.. సంస్థ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి రగిలించాయి. ఒక ప్రభుత్వ విభాగంలో ఒక అధికారినిగానీ, సిబ్బందిగానీ వారి సొంత కారణాలతోనో, ఆ శాఖ అవసరానికో ఒకచోటు నుంచి మరోచోటుకి, ఒక శాఖ నుంచి మరో శాఖకు డిప్యుటేషన్‌పై పంపడం సాధారణంగా జరుగుతుంటుంది. దీనికి కాలాన్ని కూడా చాలా తక్కువగా నిర్ణయిస్తారు. అంటే మూడునెలల నుంచి ఏడాది పాటు తాత్కాలిక విధుల్లో కొనసాగేలా ఆ ఆదేశాలు ఇస్తుంటారు. అయితే ఒకసారి ఒక చోటుకిగానీ, ఒక శాఖకుగానీ వెళ్లిన వారిలో కొందరు అక్కడి నుంచి తిరిగిరావడానికి ఇష్టపడరు. మరికొందరు ఎప్పుడు వెనక్కి వచ్చేద్దామా అని చూస్తుంటారు. వారికిచ్చిన గడువు ప్రకారం డిప్యుటేషన్‌ను పొడిగించడం, రద్దుచేయడం వంటివి ఉన్నతాధికారులు చేస్తుంటారు. ఇదీ సాధారణంగా జరిగేది. రాష్ట్రంలో 11 జిల్లాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో మాత్రం ఇందుకు విరుద్ధంగా సరికొత్త ఆచారం పుట్టుకొచ్చింది.

ఇచ్చిపడేశారంతే..

ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం (కార్పొరేట్ ఆఫీస్) విశాఖపట్నంలో ఉంది. అక్కడ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్ హోదాల్లో 35 మంది ఉద్యోగులు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. వీరిలో వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి దాదాపు తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న వారు ఉన్నారు. 2015 నుంచి 2023 వరకు ఏటా కొంతమంది చొప్పున వీరంతా వచ్చారు. ఏటా వీరి విజ్ఞప్తిని, సంస్థ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డిప్యుటేషన్లు పొడిగిస్తున్నారు. కానీ సడన్‌గా ఏమైందో ఏమోగానీ.. ఇకపై వీరు ఎన్నాళ్లయినా కార్పొరేట్ ఆఫీసులోనే ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ 35 మందికి ఇకపై ఏటేటా డిప్యుటేషన్ పొడించాలా, రద్దుచేయాలా అనే చర్చే రాకుండా చేసేశారు. ఇకపై వీరంతా పర్మినెంట్‌గా కార్పొరేట్ కార్యాలయంలోనే విధులు నిర్వర్తించేలా సంస్థ ఫైనాన్స్, హెచ్ఆర్‌డీ విభాగం డైరెక్టర్ డి.చంద్రం తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. దీంతో జిల్లాల నుంచి ఎవరైనా ఉద్యోగి విశాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లాలంటే ఇప్పుడున్నవారు ఉద్యోగ విరమణ చేస్తేగానీ కుదరదు. ఇలాంటి ముఖ్యమైన విధాన నిర్ణయాలు సీఎండీ స్థాయిలోనే తీసుకుంటారు. అలా కాకుండా డైరెక్టర్ స్థాయి అధికారి ఉత్తర్వులు ఇవ్వడం కూడా చర్చనీయాంశమైంది. ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవడం వెనుక ఏవో బలమైన కారణాలున్నాయనే చర్చ విద్యుత్ ఉద్యోగుల మధ్య జరుగుతోంది.

ఏటా ఎందుకని..

డిప్యుటేషన్లపై ఏటా ఫైలు నడపడం పెద్ద ప్రాసెస్‌గా ఉంటోంది. అలాంటిదేం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నాం. అయినప్పటికీ ఈ డిప్యుటేషన్లను ఎప్పుడైనా రద్దు చేసే అధికారం సంస్థకు ఉంది.

– ఐ.పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్

కావేరికి గోదావరి.. ఇచ్ఛంపల్లి నుంచి లేనట్లే!

- గోదావరి ట్రిబ్యునల్ అవార్డు, ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలతో వెనక్కి తగ్గిన ఎన్‌డబ్ల్యూడీఏ
- సమ్మక్క బ్యారేజ్, కంతనపల్లి, పోలవరం నుంచి కావేరికి గోదావరిపై అధ్యయనం
- సమ్మక్క బ్యారేజ్ లేదా కంతనపల్లి నుంచి అనుసంధానం చేపట్టాలన్న తెలంగాణ



సాక్షి, అమరావతి : గోదావరి ట్రిబ్యునల్ అవార్డు.. ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాల నేపథ్యంలో ఇచ్ఛంపల్లి నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలన్న ప్రతిపాదనను జాతీయ జలవనరుల అభివృద్ధి (ఎన్‌డబ్ల్యూడీఏ) సంస్థ పునఃసమీక్షిస్తోంది. ఇచ్ఛంపల్లికి దిగువన సమ్మక్క బ్యారేజ్, కంతనపల్లి, పోలవరం ప్రాజెక్టుల నుంచి కావేరికి గోదావరి జలాలను తరలించడంపై తాజాగా అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఇచ్ఛంపల్లి నుంచి 141.3 టీఎంసీల గోదావరి జలాలను కావేరికి తరలించేలా రెండున్నరేళ్ల క్రితం ప్రతిపాదించిన ఎన్‌డబ్ల్యూడీఏ.. పరీవాహక ప్రాంతం (బేసిన్) పరిధిలోని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపింది. కానీ, ఇచ్ఛంపల్లి నుంచి 85 టీఎంసీలను మించి ఉమ్మడి రాష్ట్రం వాడుకోవడానికి వీల్లేదని 1975, డిసెంబర్ 19న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇదే అంశాన్ని గోదావరి ట్రిబ్యునల్ అవార్డు స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో.. ఇచ్ఛంపల్లి నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపడితే న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయని న్యాయనిపుణులు స్పష్టంచేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు..

ఇచ్ఛంపల్లి వద్ద 118 మీటర్ల ఎత్తుతో బ్యారేజ్ నిర్మాణానికి గోదావరి ట్రిబ్యునల్ అనుమతిచ్చింది. ఆ తర్వాత మహారాష్ట్ర, ఉమ్మడి మధ్యప్రదేశ్ అభ్యంతరాలతో ఇచ్ఛంపల్లి బ్యారేజ్ ఎత్తును 108 మీటర్లకు 1986–88లో తగ్గించారు. నదుల అనుసంధానంలో భాగంగా ఇచ్ఛంపల్లి బ్యారేజ్ ఎత్తును 87 మీటర్లకు ఎన్‌డబ్ల్యూడీఏ తగ్గించింది. బ్యారేజ్ ఎత్తును 87 మీటర్లకు తగ్గించినా ఛత్తీస్‌గఢ్‌లో నాలుగు గ్రామాలు ముంపునకు గురవుతాయి. దీనిపై ఛత్తీస్‌గఢ్ అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి బేసిన్‌లో ఇంద్రావతి సబ్ బేసిన్‌లోని తమ కోటాలో వాడుకోని జలాలను కావేరికి ఎలా తరలిస్తారని ఎన్‌డబ్ల్యూడీఏని నిలదీసింది. కాదూ కూడదని తరలిస్తే న్యాయపోరాటం చేస్తామని తేల్చిచెప్పింది.

దిగువన కట్టాలని తెలంగాణ ప్రతిపాదన..

ఇక ఇచ్ఛంపల్లికి 24 కిమీల దిగువన తెలంగాణ సర్కార్ ఇప్పటికే గోదావరిపై సమ్మక్క బ్యారేజ్‌ను నిర్మించింది. గోదావరిపై ఇచ్ఛంపల్లి వద్ద బ్యారేజ్ నిర్మిస్తే.. గరిష్ఠంగా వరద వచ్చినప్పుడు ఆకస్మికంగా దిగువకు విడుదల చేస్తే సమ్మక్క బ్యారేజ్‌కు ప్రమాదం వాటిల్లే అవకాశముందని తెలంగాణ సర్కార్ ఆందోళన వ్యక్తంచేసింది. ఇచ్ఛంపల్లి నుంచి కాకుండా సమ్మక్క బ్యారేజ్ లేదా కంతనపల్లి నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్ సర్కార్ పోలవరం నుంచి అనుసంధానం చేపట్టాలని సూచించింది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సర్కార్‌ల అభ్యంతరాలతో ఇచ్ఛంపల్లి నుంచి కావేరికి గోదావరి తరలింపుపై ఎన్‌డబ్ల్యూడీఏ పునరాలోచనలో పడింది.

గుడి కోసం టీడీపీ-జనసేన కుమ్ములాట

- తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో రెండు పార్టీల మధ్య ఆధిపత్య పోరు
- తాళాల కోసం తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు
- పిఠాపురం కూటమి నేతల్లో తగ్గని వివాదాలు


ఆలయం వద్ద టీడీపీ జనసేన నేతల బాహాబాహీ

పిఠాపురం/సాక్షి, అమరావతి : కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో రెండ్రోజుల క్రితం టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ కారుపై జనసేన శ్రేణుల దాడి ఘటన మరువక ముందే.. అదే మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణాదేవి ఆలయ నిర్వహణ విషయంలో రెండు పార్టీలు ఆదివారం మళ్లీ కుమ్ములాడుకున్నాయి. ఆలయ నిర్వహణ బాధ్యతలు తమదేనని టీడీపీ నేతలు.. కాదు తమదేనంటూ జనసేన నేతలు రచ్చకెక్కారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ఈ ఘటన వివరాలివీ..తాటిపర్తి అపర్ణాదేవి ఆలయ నిర్వహణ విషయంలో గ్రామంలో పూర్వం నుంచీ ఒక ఆనవాయితీ ఉంది. నియోజకవర్గంలో ఎవరు ఎమ్మెల్యేగా నెగ్గితే ఆ పార్టీకి చెందిన నేతలు ఐదేళ్లూ ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటారు. వారి ఆధ్వర్యంలోనే ఉత్సవాల వంటి అన్ని కార్యక్రమాలూ నిర్వహిస్తారు. ఇప్పటివరకూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండటంతో ఆ పార్టీకి చెందిన నాయకులు ఆలయ బాధ్యతలు చూసేవారు. ఇటీవల టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆలయ బాధ్యతలు అప్పగించేస్తామంటూ వైఎస్సార్‌సీపీ నేతలు టీడీపీ, జనసేన నాయకులకు సమాచారం ఇచ్చారు. ఆలయం వద్దకు వస్తే అందరి సమక్షంలో ఆలయ తాళాలు ఇచ్చేస్తామని చెప్పారు. దీంతో కూటమి నేతలు ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వచ్చారు. పిఠాపురంలో జనసేన నెగ్గడంతో ఆ పార్టీకి చెందిన నేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అందరి సమక్షంలో ఆలయ తాళాలు అందజేశారు. దీనికి గ్రామస్తులందరూ ఆమోదం తెలిపారు.

వివాదానికి టీడీపీ ఆజ్యం..

అయితే, ఈ విషయం టీడీపీ నియోజకవర్గ నేతకు తెలిసింది. జనసేనను ముందు నుంచీ వ్యతిరేకిస్తున్న ఆ నేత టీడీపీ వారికే ఆలయ పెత్తనం ఇచ్చేలా పట్టుబట్టాలని ఆదేశాలిచ్చినట్టు సమాచారం. దీంతో అప్పటివరకూ అన్నింటికీ అంగీకారం తెలిపిన టీడీపీ నేతలు.. ఒక్కసారిగా వివాదానికి తెరలేపారని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికల్లో నెగ్గింది జనసేన అయినా గెలిపించింది తామేనని.. అందుకే తమకే ఆలయ తాళాలు అప్పగించాలని టీడీపీ నాయకులు ఆలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో జనసేన–టీడీపీ వర్గాల మధ్య ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలూ బాహాబాహీకి దిగడంతో ఒక దశలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న కాకినాడ డీఎస్పీ హనుమంతరావు నేతృత్వంలో పిఠాపురం సీఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, ఇరువర్గాలనూ చెదరగొట్టారు. అయినప్పటికీ తాళాలిచ్చే వరకూ కదిలేదిలేదని టీడీపీ నేతలు ఆలయం వద్ద బైఠాయించారు. ఇరువర్గాలతో చర్చించిన పోలీసులు వివాదం తేలేవరకు ఆలయ తాళాలు అధికారుల వద్ద ఉండేలా ఒప్పించారు. అనంతరం తాళాలను స్థానిక వీఆర్‌ఓకు అప్పగించారు. తమకు ఎలాగూ ఆలయం దక్కేదిలేదని గ్రహించిన టీడీపీ నేతలు ఆలయాన్ని దేవదాయ శాఖకు అప్పగించాలనే డిమాండును తెరపైకి తీసుకువచ్చారనే ప్రచారం గ్రామంలో జోరుగా జరుగుతోంది. అపర్ణాదేవి ఆలయం దేశంలోనే పేరొందింది. ఇక్కడకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం అనేకమంది భక్తులు, వీఐపీలు వస్తూంటారు. ఆదాయం కూడా అంతలా ఉంటుంది.

ఈ నేపథ్యంలోనే ఆలయంపై పెత్తనం తమకు దక్కకపోతే.. జనసేనకూ దక్కకూడదని భావించిన టీడీపీ నేతలు.. ఈ ఆలయాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

సంయమనం పాటించాలి : నాగబాబు

మరోవైపు.. ఈ ఘటనపై జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు స్పందిస్తూ.. కూటమి సభ్యుల్లో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరిగిన ఘటన వివరాలు సేకరిస్తున్నామని, ఇందులో తమ పార్టీ వారు ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాటిపర్తిలో ఆదివారం చోటుచేసుకున్న ఘటనపై కూడా నాయకులు చర్చించి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. పదిరోజుల్లో పవన్ పిఠాపురం వస్తారని చెప్పారు.

అపరాలలోనూ విత్తన మార్పిడి

మినుము, పెసలు, కందులులో కొత్త రకాలు

- శనగలో కొత్త వంగడాలకు ప్రోత్సాహం
- ప్రస్తుత ఖరీఫ్ నుంచే విత్తన మార్పిడి
- దశలవారీగా కొత్త వంగడాలు

సాక్షి, అమరావతి: విత్తన మార్పిడిపై వ్యవసాయ శాఖ దృష్టి పెట్టింది. ఏళ్ల తరబడి సాగులో ఉన్న రకాల స్థానంలో కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఖరీఫ్, రబీ సీజన్లలో విస్తారంగా సాగయ్యే అపరాలతో పాటు రబీ సీజన్‌లో ఎక్కువగా సాగయ్యే శనగలో కొత్త వంగడాలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఖరీఫ్‌లో వరి తర్వాత ఎక్కువగా 5.9 లక్షల ఎకరాల్లో కందులు, 1.5 లక్షల ఎకరాల్లో మినుములు, పెసలుతో పాటు ఇతర అపరాలు సాగవుతుంటాయి. రబీలో వరి తర్వాత 10.92 లక్షల ఎకరాల్లో శనగ, 7.25 లక్షల ఎకరాల్లో మినుము, 1.75 లక్షల ఎకరాల్లో పెసలు, మరో 1.10 లక్షల ఎకరాల్లో ఇతర అపరాలు సాగవుతుంటాయి. అపరాలు, శనగలలో కొన్ని రకాలు 30 ఏళ్లకు పైబడి సాగులో ఉన్నాయి. ప్రధానంగా ఖరీఫ్‌లో కందులులో ఎల్ఆర్‌జీ 52 (2015) వంగడం 1.50 లక్షల ఎకరాలలో సాగవుతుండగా, ఎల్ఆర్‌జీ 41 రకం (2007) 29వేల ఎకరాలు, ఆషా (1992) వంగడం 11వేల ఎకరాల్లో సాగవుతోంది. మినుములో పీయూ–31 (2005) రకం 58 వేల ఎకరాల్లో సాగవుతోంది. రబీలో శనగలు అత్యధికంగా 1999లో విడుదలైన జేజీ–11 రకం ఏకంగా 7.25 లక్షల ఎకరాల్లో, కేఏకే–2 (2000) రకం 44 వేల ఎకరాల్లో సాగవుతోంది. ఈ రకాలు చీడ పీడలను తట్టుకోలేకపోతున్నాయి. తుపాన్లు, వర్షాల సమయంలో ముంపునకు గురై రైతులకు భారీ నష్టాన్ని మిగులుస్తున్నాయి. వీటికి ప్రత్యామ్నాయంగా ఇటీవల విడుదలైన తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించింది.

దశలవారీగా విస్తరణ

డీఏఏటీఐ, కేవీకే శాస్త్రవేత్తలు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో జిల్లా స్థాయిలో నిర్వహించిన సదస్సులతో కొత్త విత్తనాల సాగుపై వ్యవసాయ శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. దశలవారీగా కొత్త రకాల సాగును విస్తరించనుంది. 2024–25 సీజన్‌లో 10 శాతం, 2025–26 సీజన్‌లో 15 శాతం, 2026–27లో 25 శాతం విస్తీర్ణంలో విత్తన మార్పిడి చేయనున్నారు. తరువాత సంవత్సరాల్లో ఇదే విధానం కొనసాగుతుంది. ఈ విత్తనాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించనున్నారు. కొత్త రకాల ప్రత్యేకతను అందరికీ అర్థమయ్యే రీతిలో వాల్ పోస్టర్లు, కరపత్రాలు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతుల సందేశాలతో కూడిన వీడియోలు, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వివరిస్తారు.

ఏపీ సీడ్స్ ద్వారా సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి

బ్రీడర్ విత్తనాన్ని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉత్పత్తి చేసింది. ఎంపిక చేసిన రైతుల క్షేత్రాల్లో బ్రీడర్ సీడ్ నుంచి మూల విత్తనాన్ని పండిస్తారు. ఈ మూల విత్తనాన్ని ఏపీ సీడ్స్ ఎంపిక చేసిన రైతుల క్షేత్రాల్లో నాటి సర్టిఫైడ్ సీడ్‌ను పండిస్తారు. వీటిని ఏపీ విత్తన ధ్రువీకరణ అథారిటీ ధ్రువీకరిస్తుంది. బ్రీడర్, ఫౌండేషన్ సీడ్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ముందుగా ప్రాధాన్యతనిస్తారు. పూర్తిస్థాయిలో విత్తనం అందుబాటులోకి తెచ్చిన తర్వాత సబ్సిడీపై రైతులకు సరఫరా చేస్తారు.

మినుములో ప్రత్యామ్నాయ రకాలు



- పీయూ–31కు బదులుగా ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌బీజీ 884, టీబీజీ 104, వీబీఎన్8, ఎల్‌జీబీ 904, జీబీజీ1, టీబీజీ 129, ఎల్‌బీజీ 787, ఎల్‌బీజీ 752 ప్రవేశపెడతారు. రబీలో ఎల్‌బీజీ 752 మినహా మిగిలిన వంగడాల సాగును ప్రోత్సహిస్తారు.
- తరచూ తెగుళ్ల బారిన పడుతున్న ఐపీయూ 2–43 కి ప్రత్యామ్నాయంగా రెండు సీజన్లలో ఎల్‌బీజీ 904 రకం
- ఎల్‌బీజీ 752కు బదులుగా ఖరీఫ్‌లో టీబీజీ 129, రబీలో టీబీజీ 104, వీబీఎన్ 8, ఎల్‌బీజీ 904, జీబీజీ1, ఎల్‌బీజీ 787
- టీ–9కు బదులుగా రెండు సీజన్‌లలో ఎల్‌బీజీ 884 రకాన్ని, టీబీజీ 104కు బదులుగా ఎల్‌బీజీ 904 రకం

పెసలులో ప్రత్యామ్నాయ రకాలు:



- ఐపీఎం 2–14కు ప్రత్యామ్నాయంగా రెండు సీజన్‌లలో ఎల్‌జీజీ 574, ఎల్‌జీజీ 607,ఎల్‌జీజీ 630 ఎల్‌జీజీ 600 రకాలు. రబీలో వీటితో పాటు అదనంగా విరాట్, శిఖ రకాలు
- ఎల్‌జీజీ 407కు ప్రత్యామ్నాయంగా రెండు సీజన్‌లలో ఎల్‌జీజీ 607 రకాలు, ఎల్‌జీజీ 460కు బదులుగా ఐపీఎం 2–14, ఎల్‌జీజీ 630, ఎల్‌జీజీ 607 రకాలు

కందులులో ప్రత్యామ్నాయ వంగడాలు

- ఎల్ఆర్‌జీ 52 స్థానంలో ఖరీఫ్‌లో టీఆర్‌జీ 59 (తిరుపతి కంది), ఎల్ఆర్‌జీ 105, ఎల్ఆర్‌జీ 133–33, పీఆర్‌జీ 176 రకాలను, రబీలో ఎల్ఆర్‌జీ 105 (కృష్ణ) రకాలను ప్రవేశపెడతారు.
- ఎల్ఆర్‌జీ 41 స్థానంలో ఖరీఫ్‌లో పీఆర్‌జీ 158, టీఆర్‌జీ 59, ఎల్ఆర్‌జీ 105, ఎల్ఆర్‌జీ 133–33 (సౌభాగ్య), పీఆర్‌జీ 176, ఎల్ఆర్‌జీ 52 రకాలను, రబీలో ఎల్ఆర్‌జీ 105 రకాలు
- ఐసీపీహెచ్ 2740, ఐసీపీఎల్ 87119, పీఆర్‌జీ 158 రకాలకు బదులుగా రెండు సీజన్‌లలోనూ ఎల్ఆర్‌జీ 105 రకం
- ఐసీపీహెచ్ 87063 కు బదులుగా రెండు సీజన్‌లలోనూ ఎల్ఆర్‌జీ 105, ఎల్ఆర్‌జీ 133–33 రకాలను ప్రవేశపెడతారు.





శనగలో ప్రత్యామ్నాయ రకాలు



శనగలో కేఏకే 2కు బదులుగా ఎన్‌బీఈజీ 119 రకాన్ని, జేజీ 11కు బదులుగా ఎన్‌బీఈజీ 776 రకాలు, ఎన్ఈజీ 452 (నంద్యాల గ్రామ్ 452), ఎన్‌బీఈజీ 810 (నంద్యాల గ్రామ్ 810), ఎన్‌బీఈజీ 857 (నంద్యాల గ్రామ్) వంటి కొత్త వంగడాల సాగును ప్రోత్సహించనున్నారు

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
సోమవారం ॥ 10-6-2024



గృహస్థాశ్రమ వైశిష్ట్యం

పెళ్ళి.. ఎందుకోసం?

గృహప్రవేశం చేయాలి. అప్పుడు యజుర్వేదం అంతా మనకు వచ్చా, రాదా అన్న దానితో సంబంధం లేదు. గృహప్రవేశ సందర్భంలో రాముడేం చేసాడో ఆ ఘట్టం చదువుకుంటే చాలు... ఓహో, గృహప్రవేశం ఇలా చేయాలన్న మాట.. అన్నది తెలుస్తుంది. తండ్రిగారికి తద్దినం పెట్టాల్సి వస్తే రాముడేం చేశాడో చదువుకుంటే సరిపోతుంది. అది పెట్టవలసి వచ్చినప్పుడు ఇలా పెట్టాలని అర్థమవుతుంది. అందుకే వేదం రామాయణంగా ప్రవర్తించింది.

చంద్రవంశాన్ని అంతటినీ వ్యాసుడు రచించాడు. సూర్యవంశాన్ని అంతటినీ కూడా వాల్మీకి వర్ణించాడు. సూర్యుడు, చంద్రుడు పగలూ రాత్రి ప్రకాశిస్తారు. ఒక పగలు, ఒక రాత్రి కలిస్తే ఒక రోజు పూర్తవుతుంది. వాఙ్మయంలో రామాయణం, భారతం ఇతర పురాణాలను వాల్మీకి, వ్యాసుడు అందించారు. స్వార్థంతోనో, ప్రత్యుపకారం ఆశించో కాక దీనివల్ల ధర్మానుష్ఠాన పద్ధతులను అందరికీ అర్థమయ్యే పద్ధతిలో విడమరిచి చెప్పకపోతే జనసామాన్యానికి ఎలా తెలుస్తుందనే సదుద్దేశంతో వారు మనకు ఈ మహోపకారం చేసారు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వివాహం ఎంత గొప్పది! వివాహం అంటేనే విశిష్టమైనది–అని. దానిని మనకు సంప్రాప్తింప చేయడానికి జరిపే సంస్కారమే వివాహం. అది ఏదో సరదాకోసం కాదురా నాయనా, వివాహం చేసుకుంటా నంటున్నావు కదా, ముందు దానిగురించి, దానిలోని ధర్మసూక్ష్మాలను గురించి తెలుసుకో. వివాహం అంటే విశిష్టమైనదానిని పొందుట. మరి ఆ విశిష్టమైనదేది? అదే మోక్షం. దీనిని పొందడానికి యోగ్యమైనది ధర్మానుష్ఠానం. అది సక్రమంగా జరగకుండా దానికి అడ్డుపడుతున్నవి ఏవి? అర్థకామాలు రాగద్వేషాలయి పాపపుణ్యాలకు, పునర్జన్మలకు కారణమవుతాయి. అలాకాకుండా దానిని ధర్మబద్ధం చేసి పాశాలు విడిపోవడానికి సంసార ప్రవేశం జరగాలి. అటువంటి గృహస్థాశ్రమంలోకి నీవు ప్రవేశిస్తున్నావు. అలా ప్రవేశించి రాముడేం చేసాడో తెలుసా? సీతారామకళ్యాణ ఘట్టం చూడు. అక్కడ సీతమ్మ ఏం చేసింది ? అసలు పెద్దవాళ్ళనే వాళ్ళు పెళ్ళికూతురిని, పెళ్లికొడుకుని కూర్చోబెట్టి ఏం మాట్లాడారో పరిశీలించు. పెద్దరికం అంటే ఏమిటో కూడా తెలుస్తుంది. ఇవన్నీ తెలిస్తే సంసారంలో ఎప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి, కుటుంబ జీవితాన్ని చక్కదిద్దుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఈ ఉద్దేశంతో రుషులు దేశకాలాలతో సంబంధం లేకుండా సర్వకాలాల్లో సర్వజనులకు ఉపయోగపడే విధంగా వాటిని అందించారు. అటువంటి రుషుల రుణం మనకు జన్మతః ఉంది.

మీరు ఎంతో చదువుకున్నారు... సరే. మంచిదే. నేను చదువును తక్కువ చేసి చెప్పడం లేదు. కానీ చదువుతో పాటుగా నిత్యజీవితంలో మనిషి మనిషిగా ఉండడానికి కావలసిన మానవత్వాన్ని నిలబెట్టడం చాలా అవసరం. అలా అది నిలబడాలంటే... రామాయణం, భారతం తదితర గ్రంథాలను బాగా పరిశీలించాలి. అవి నిత్యపారాయణకు యోగ్యత ఉన్న గ్రంథాలు. వాటిని కనీసం రోజుకో అధ్యాయం చొప్పున అయినా చదువుకుంటూ ఉండాలి. ఇంటిపట్టున పెద్దవాళ్ళు పిల్లలతో వాటిగురించి తరచూ మాట్లాడుతూ ఉండాలి. దానివల్ల ధార్మిక జీవనం అలవడడమే గాక, మనుషుల్లో మానవత్వం మిగులుతుంది. అది లేనప్పుడు మీరు సమకూర్చుకున్న జ్ఞానం, ప్రతిభాపాటవాలు సమాజానికి ప్రమాదకరంగా మారవచ్చు.

మంచిమాట

“పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం” అనే జాతీయం ఉంది. అతి తక్కువ బలం ఉన్న ప్రాణి మీద అనవసరంగా అతి పెద్ద బలప్రయోగం చేయటం అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఎంత చిన్న ప్రాణి అయినా దాని అస్తిత్వం నిరుపయోగం కాదు. విశ్వంలో, ముఖ్యంగా భూగోళంలో, ప్రధానంగా అది ఉండే ప్రాంతంలో అది పోషించవలసిన పాత్ర ఒకటి ఉండనే ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, తద్వారా పర్యావరణ సమతౌల్యత ఉంటాయి. దానికి భంగం కలిగిస్తే పర్యవసానం అనుభవించ వలసి ఉంటుంది.

పిచ్చుక మీదనా బ్రహ్మాస్త్రం?



ఒక పిచ్చుక సంవత్సరంలో 6.5 కిలోల బియ్యం తింటుంది అని చైనాలో ఒకప్పుడు చేపట్టిన సర్వే తెలిపింది. మొత్తం పిచ్చుకలు లేకుండా చేయగలిగితే 60 వేల మందికి ఆహారం లభిస్తుంది అని కూడా తెలిపింది. ఇంకేముంది? అసలే అధిక జనాభా సమస్య ఉన్న చైనా, వీళ్లైనంత మందికి ఆహారం అందించటానికి ఇదొక మార్గం అనుకుని పిచ్చుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టింది. 30 లక్షల పిచ్చుకలని చంపారు.

1958 – 61 సంవత్సరాల మధ్య చైనాలో తీవ్రమైన కరవు వచ్చింది. సుమారుగా నాలుగు కోట్ల యాభై వేల మంది చని పోయారు. కారణం ఏమై ఉంటుంది అని విచారణ చేస్తే పిచ్చుకలు లేక పోవటం వల్ల అని తేలింది. అదెట్లా? పిచ్చుకలు ధాన్యం తినటంతోపాటు పంటలని నాశనం చేసే పురుగులని కూడా తింటాయి. చీడ పురుగులని తినే పిచ్చుకలు లేక పోవటంతో పంటలకి చీడ పట్టి, తెగులు సోకి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గింది. అది రాను రాను పెరిగింది. ప్రజలు తిండి లేక చనిపోయారు.

దీనికి పరిష్కారం పంటలని నాశనం చేసే తెగుళ్ల కలిగించే పురుగులని రసాయన పదార్థాలు వాడ నవసరం లేకుండా తినేసే పిచ్చుకలు ఉండేట్టు చేయటమే అని నిర్ధారించారు. చేసేది ఏమీ లేక పిచ్చుకలని దిగుమతి చేసుకోవాలనుకున్నారు. రష్యా నుండి పిచ్చుకలని దిగుమతి చేసుకున్నారు. పరిస్థితి అదుపు లోకి వచ్చింది.

ఇటువంటి శాస్త్రీయమైన విషయాలని మన దేశంలో ఒక ఆనవాయితీగా, ఆచారంగా చేయటం అలవాటు. భారతదేశంలో, ముఖ్యంగా తెలుగువారు వరికంకులని కుచ్చుగా అల్లి ఇంటి ముందు వేలాడ దీసే వారు. పిచ్చుకలు వచ్చి ఒక్కొక్క వడ్లగింజని తీసుకు వెళ్లేవి. అది రైతు పురుగులని తిని చీడ పీడల నుండి పంటని రక్షించిన పిచ్చుక పట్ల చూపించే కతజ్ఞత. ఇంటి ముందు కొన్ని గింజలు చల్లటం అలవాటు. ఆ అవకాశం ఉన్నా, లేక పోయినా ప్రతి రోజు పక్షులకి, ప్రత్యేకంగా కాకికి తినబోయే ముందు ఒక ముద్ద పెట్టటం అలవాటు. కాకి పరిసరాల్లో ఉన్న చెత్తని, చిన్న చిన్న పురుగులని తిని శుభ్రం చేస్తుంది. దేవాలయాలలో కూడా బలిహరణం అన్న పేరుతో నాలుగు దిక్కుల అన్నం ఉంచటం సంప్రదాయం. ఇంటి చూరులో పిచ్చుక గూడు పెడితే పరమానందం. ఆ గూట్లో పెట్టిన గుడ్లను పిల్లి తినకుండా కాపలా కాయటం ఒక సరదా. అవి ఉండే ప్రదేశాలని మనం ఆక్రమించి, చెట్లని నరికి వాటికి ఆహారం లేకుండా చేసినందుకు ఈ మాత్రం చేయక పోతే కృతఘ్నులం అవుతాం. అలాగని పిల్లులని పూర్తిగా తరమం. పిల్లి తిరుగుతుంటే ఆ వాసనకి ఎలుకలు విజృంభించవు.

సృష్టిలో ప్రయోజనం లేని జీవి ఒక్కటి కూడా లేదు. గుర్తించక పోవటం మన లోపం. జాగ్రత్తగా గమనిస్తే ఇతర జీవులని, ప్రకృతిని స్వార్థానికి వాడుకుని ఎవరికీ ఉపయోగ పడని ప్రాణి మానవుడొక్కడేనేమో అనిపిస్తుంది. కనీసం పిచ్చుక పాటి అయినా చేయవద్దా?

– డా. ఎన్. అనంత లక్ష్మి


ఆధ్యాత్మికథ

దృష్టిని బట్టి సృష్టి

ఉత్తర భారత దేశానికి చెందిన ఒక ప్రొఫెసర్ స్వామి వారి దర్శనార్థం తిరుపతి వెళ్ళాడు. తనతో పాటు సహాయకుడిగా పరిశోధక విద్యార్థిని కూడా వెంట తీసుకు వచ్చాడు. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి గుండా తిరుమలకు కాలినడకన వెళ్ళాలనేది ప్రొఫెసర్ గారి ఆలోచన. అలిపిరికి వెళ్ళి ఎత్తైన శేషాచల శిఖరాన్ని చూశారు. సముద్ర మట్టానికి 2800 అడుగుల ఎత్తులో ఉన్న ఏడుకొండల్ని చూసి భక్తి భావంతో దణ్ణం పెట్టుకున్నారు. పాదాల మండపం వద్ద శ్రీవారి లోహ పాదాలను నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణ చేస్తూ ఉండగా పరిశోధక విద్యార్థి చిన్నగా ప్రొఫెసర్‌ని ఇలా అడిగాడు.

“దేవుడు నిజంగా ఉన్నాడంటారా?” అని.

ప్రొఫెసర్ నవ్వి “దారిలో కనిపిస్తాడు పద!” అని చెప్పి కాలి నడకకు పురమాయించాడు.



అలిపిరినుంచి ఆనంద నిలయుని సన్నిధికి దారి తీసే ఆ పడికట్ల దోవలో ప్రకృతి అందాలను వీక్షిస్తూ నడక ప్రారంభించారు. తలయేరు గుండు, గాలి గోపురం, ఏడవ మైలు ప్రసన్నాంజనేయ స్వామి, అక్కగార్ల గుడి, అవ్వాచారి కోన... దాటి మోకాలి మెట్టు చేరారు.

తిరుమల కొండ ‘ఆదిశేషుని అంశ’ అని భక్త జన విశ్వాసం. అందుకే చెప్పులు లేకుండా కొండ ఎక్కుతారు భక్తులు. ఈ కొండను పాదాలతో నడిచి అపవిత్రం చేయకూడదని శ్రీరామానుజులు, హథీరాంజీ బావాజీ మోకాళ్ళ మీద నడిచారని చెబుతారు. అప్పటినుంచి అది మోకాలి మెట్టు అయ్యిందని కూడా తెలుసుకున్నారు. అక్కడ మెట్లు నిలువుగా మోకాలి ఎత్తు ఉండటం వల్ల మోకాళ్ళు పట్టుకుపోసాగాయి పరిశోధక విద్యార్థికి.

మోకాళ్ళ నొప్పులు ఎక్కువైన ఆ విద్యార్థి గట్టిగా “దేవుడు కనిపిస్తున్నాడు!” అని చెప్పాడు.

చిన్న నవ్వు నవ్విన ప్రొఫెసర్, “అనుకున్నది అనుకున్నట్లు ఎవరికీ జరగదు. అలా జరిగితే ఎవ్వరూ చెప్పిన మాట వినరు. తలచినట్లే అన్నీ జరిగితే... మనిషి దేవుడి ఉనికినే ప్రశ్నిస్తాడు. కష్టాలు, కన్నీళ్లు లేకుంటే తనంత గొప్పవాడు లేడని విర్రవీగుతాడు. అహాన్ని తలకి ఎక్కించుకున్నవాడు తనే దేవుడని చెప్పి ఊరేగుతాడు. జీవితం కష్టసుఖాల మయం కాబట్టే, మనిషి ఆ అతీత శక్తిని ఆరాధిస్తున్నాడు! అందుకే అలిపిరి వద్ద నేల మీద నడిచేటప్పుడు నీకు దేవుడి ఉనికి ప్రశ్నార్థకమయ్యింది. మోకాలిమెట్టు దగ్గరికి వచ్చేసరికి దేవుడు ఉన్నాడని అనిపించింది” అని చెప్పి గబగబా మెట్లు ఎక్కసాగాడు.

‘దృష్టిని బట్టి సృష్టి’ అని తెలుసుకున్న విద్యార్థి గోవింద నామస్మరణ చేస్తూ ప్రొఫెసర్ వెనుకనే నడవసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా


ఎన్టీఆర్

గోవాలో ఆటా పాటా...


మళ్లీ గోవా వెళ్లాడు దేవర. ‘జనతా గ్యారేజ్’ (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం ‘దేవర’. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగాన్ని ఈ ఏడాది అక్టోబరు 10న రిలీజ్ చేయనున్నట్లు గతంలో మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రంలో తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ గోవాలో ప్రారంభమైంది. ఎన్టీఆర్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో ఓ సాంగ్, కొంత టాకీ పార్ట్, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట. ఈ ఏడాది మార్చిలో ‘దేవర’ యూనిట్ గోవాలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించింది. ఇప్పుడు మళ్లీ గోవాలో షూటింగ్ జరుగుతోంది.


అమితాబ్

సీక్వెల్ సెట్‌లో...

గుజరాతీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు అమితాబ్ బచ్చన్. 2022లో అమితాబ్ ఓ కీలక పాత్రలో నటించిన ‘ఫక్త్ మహిళా మాటే’ చిత్రానికి సీక్వెల్ ఇది. యశ్ సోనీ, దీక్షా జోషి ప్రధాన పాత్రల్లో నటించిన ‘ఫక్త్ మహిళా మాటే’కు మంచి ప్రేక్షకాదరణ దక్కింది. జై బోదాస్ దర్శకత్వంలో ఆనంద్ పండిట్, వైశాల్ షా ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌గా ‘ఫక్త్ పురుషో మాటే’ అనే సినిమాను ఆరంభించారు. అమితాబ్, యశ్ సోనీ, మిత్ర గాఢ్వీ, ఇషా కన్సారా, దర్శన్ జరీవాలా సీక్వెల్‌లో ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. ఈ సీక్వెల్‌ని పార్థ్ త్రివేదీతో కలిసి జై బోదాస్ దర్శకత్వం వహిస్తుండటం విశేషం. ప్రస్తుతం అమితాబ్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. “అమితాబ్ బచ్చన్‌గారితో ఓసారి పని చేసిన ఎవరైనా ఆయనతో మళ్లీ వర్క్ చేయాలనుకుంటారు. అమితాబ్‌గారి ఎనర్జీ, అంకితభావం సెట్స్‌లో ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది” అని పేర్కొన్నారు నిర్మాత ఆనంద్ పండిట్. ఈ సంగతి ఇలా ఉంచితే... మహిళల మనసుల్లో ఏముందో తెలుసుకోగల శక్తులు ఓ కుర్రాడికి వస్తాయి. వాటితో ఆ యువకుడు ఏం చేశాడు? విడిపోతున్న ప్రేమికులను ఎలా కలిపాడు? అనే అంశాలతో ‘ఫక్త్ మహిళా మాటే’ చిత్రం సాగుతుంది. ఇక సీక్వెల్ మగవారి కోణంలో ఉంటుందని టైటిల్ స్పష్టం చేస్తోంది.

ఆమెతో నమ్మకం మొదలవుతుంది


దీపికా పదుకోన్

ప్రభాస్ హీరోగా నటించిన తాజా పాన్ ఇండియన్ చిత్రం ‘కల్కి 2898 ఏడీ’. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ ఈ సినిమా ద్వారా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. కాగా ఈ మూవీ ట్రైలర్‌ని నేడు విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, దీపికా పదుకోన్ లుక్‌ను విడుదల చేసింది. ‘ది హోప్ బిగిన్స్ విత్ హర్’ (ఆమెతో నమ్మకం మొదలవుతుంది) అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన దీపిక లుక్ నెట్టింట వైరల్‌గా మారింది. “సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా ‘కల్కి 2898 ఏడీ’ రూపొందింది. మహాభారత పురాణ ఘటనల నుండి మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యే కథ ఇది. గతం, భవిష్యత్తుతో ముడిపడిన ఆరువేల ఏళ్ల వ్యవధిలో ఈ చిత్రకథ నడుస్తుంది” అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్.

విలన్ వచ్చేశాడు

శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ యాక్షన్ ప్యాక్డ్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలోని విలన్ పాత్రకు బాలీవుడ్ నటుడు విద్యుత్ జమాల్‌ను తీసుకున్నారు మేకర్స్. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించి, సెట్స్‌లో విద్యుత్ జమాల్ పాల్గొన్న వీడియోను కూడా షేర్ చేశారు. “నా స్నేహితుడు విద్యుత్ జమాల్‌తో కలిసి మళ్లీ వర్క్ చేయడం సంతోషంగా ఉంది” అని పేర్కొన్నారు మురుగదాస్. విజయ్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ ‘తుపాకీ’లో విద్యుత్ జమాల్ విలన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.


విద్యుత్ జమాల్

టీజర్ రొమాంటిక్‌గా ఉంది

– అక్కినేని అమల

చైతన్యా రావ్, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం ‘హనీమూన్ ఎక్స్‌ప్రెస్’. ఈ రొమాంటిక్ కామెడీ సినిమాను బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అక్కినేని అమల మాట్లాడుతూ– “తెలుగు సినిమాకు దర్శకత్వం వహించాలన్న బాల రాజశేఖరుని ఆకాంక్ష ఈ సినిమాతో నెరవేరింది. మా అన్నపూర్ణ కాలేజ్ విద్యార్థులు, సిబ్బందిని కూడా ఈ మూవీలోకి తీసుకున్నందుకు హ్యాపీగా ఉంది. టీజర్ ఫన్నీగా, రొమాంటిక్‌గా ఉంది. నేటి సమాజంలోని వివాహ బంధాల గురించి ఒక బలమైన కథను ప్రేక్షకులకు చూపించబోతున్నట్లుగా టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి” అన్నారు. “రొమాంటిక్ కామెడీగా ‘హనీమూన్ ఎక్స్‌ప్రెస్’ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సుచిన్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ వారు మా చిత్రాన్ని విడుదల చేస్తున్నారు” అన్నారు బాల రాజశేఖరుని. తనికెళ్ల భరణి, సుహాసిని, అరవింద్ కృష్ణ, అలీ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: కల్యాణీ మాలిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: ఆర్పీ పట్నాయక్, కెమెరా: శిష్లా వీఎమ్‌కే.


బాల రాజశేఖరుని, అమల

ఈ నెలలోనే లాక్‌డౌన్!


అనుపమా పరమేశ్వరన్

ఈ నెలలోనే లాక్‌డౌన్ అంటున్నారు హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. కానీ కంగారు పడవలసిన అవసరం ఏమీ లేదు. ఎందుకంటే... ఆమె చెబుతున్నది ‘లాక్‌డౌన్’ సినిమా గురించి. అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘లాక్‌డౌన్’. ఏఆర్ జీవాను దర్శకుడిగా పరిచయం చేస్తూ లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. కాగా ఈ సినిమాలో అనిత అనే పాత్రలో అనుపమా పరమేశ్వరన్ నటించినట్లుగా తెలుస్తోంది. లాక్‌డౌన్‌లో చిక్కుకుపోయి కష్టాలు పడుతున్న ఓ యువతి నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందట. లాక్‌డౌన్ కష్టాలతోపాటు కరోనా వైరస్ గురించిన అంశాలను ఈ సినిమాలో కాస్త సీరియస్‌గానే చూపిస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. చార్లీ, నిరోషా, ప్రియా వెంకట్, లివింగ్‌స్టన్, ఇందుమతి, రాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు ఎస్ఆర్ రఘునందన్, సిద్ధార్థ్ విపిన్ సంగీతం అందించారు. ఈ సినిమాకు కెమెరా: వీజే సాబు జోసెఫ్.

భూగోళానికే నా చెలి అందం

శ్రీకమల్, తాన్వీ



“ప్రపంచానికే జాబిలి అందం.. భూగోళానికే నా చెలి అందం... ఇంతందాన్ని ఎవరైనా చూశారా..” అంటూ సాగే పాట ‘ఉషా పరిణయం’ సినిమాలోనిది. ‘నువ్వే కావాలి, మన్మథుడు, మల్లీశ్వరి’ వంటి చిత్రాలను తెరకెక్కించిన కె. విజయభాస్కర్ స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘ఉషా పరిణయం’. ఈ మూవీలో ఆయన తనయుడు శ్రీకమల్ హీరోగా నటించారు. తెలుగు అమ్మాయి తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ‘ఆకాశానికే జాబిలి అందం...’ అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ చిత్ర సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధ్రువన్ పాడిన ఈ పాటకు అలరాజు సాహిత్యం అందించారు. “ప్రేమకు నేనిచ్చే నిర్వచనం ఈ సినిమా. అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి” అన్నారు కె. విజయభాస్కర్.

మూడు షెడ్యూల్స్‌లో...

అవినాష్, సిమ్రాన్



అవినాష్ తిరువీధుల, సిమ్రాన్ చౌదరి జంటగా కొత్త సినిమా షురూ అయింది. కార్తీ దర్శకత్వంలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ ఎల్ఎల్‌పీపై శాంతనూపతి, ఆలపాటి రాజా, అవినాష్ బుయాని, అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. తొలి సీన్‌కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి క్లాప్ కొట్టగా, దర్శకుడు బాబీ దర్శకత్వం వహించారు. దర్శకుడు కార్తీ మాట్లాడుతూ– “కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది. నేడు రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, మూడు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం” అన్నారు. “మంచి సినిమా తీయాలనే సంకల్పంతో అమెరికా నుంచి వచ్చాం” అన్నారు శాంతనూపతి. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు అంబికా కృష్ణ, దామోదర ప్రసాద్, టి. రామసత్యనారాయణ, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌నాయుడు, రచయిత విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎ. విశ్వనాథ్, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: రాంబాబు కుంపట్ల.

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,619	469
76,693	23,290

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,133	▽	40
డోజోన్స్	38,799	▽	87
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,245	▽	40
డాక్స్	18,557	▽	95
షాంఘై	3,051	△	2
నికాయ్	38,684	▽	20

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారమనవేత	81.54	85.22
£	బ్రిటన్ పౌండ్	భారమనవేత	104.33	109.19
€	యూరో	భారమనవేత	88.64	93.11
¥	జపాన్ ఎన్ (100)	భారమనవేత	41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారమనవేత	53.23	58.01
S$	సింగపూర్ డాలర్	భారమనవేత	59.69	64.36
SAR	సౌదీ రియాల్	భారమనవేత	21.34	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	భారమనవేత	21.81	23.60
¥	చైనా యువాన్	భారమనవేత	10.39	12.46

బంగారం బంగారమే



కాలంతో పాటే దేశీ కరెన్సీ విలువ తరిగిపోతుంటుంది. కానీ, కాలంతోపాటే విలువ పెంచుకుంటూ వెళ్లే వాటిల్లో బంగారం కూడా ఒకటి. అందుకే ప్రతి ఒక్కరి పెట్టుబడుల్లో బంగారానికి (గోల్డ్) తప్పక చోటు ఇవ్వాలి. ఇటీవలి కాలంలో బంగారంలో మంచి ర్యాలీ చూస్తున్నాం. ప్రతి ఏటా పసిడి ఇదే మాదిరి పరుగు పెట్టుకపోవచ్చు. కానీ, దీర్ఘకాలంలో మంచి రాబడిని ఇచ్చే విషయంలో నిజంగా 'బంగారమే' అని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందే. 2017–18 సంవత్సరం సావరీన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ)లో ఇన్వెస్ట్ చేసినవారికి గడిచిన ఐదేళ్లలో ఏటా 16.5 శాతం రాబడి వచ్చింది. సంప్రదాయ డెట్ సాధనాల కంటే రెట్టింపు రాబడి బంగారంలో రావడం అంటే మామూలు విషయం కాదు. ఈక్విటీల స్థాయిలో బంగారం రాబడి ఇవ్వడం విశేషం. అందుకే దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసేవారు బంగారానికి తప్పక చోటు ఇవ్వాలి. ఏ రూపంలో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ ప్రయోజనమో తెలియజేసే కథనమే ఇది.



వివిధ సాధనాలు

బంగారంలో ఇన్వెస్ట్ చేయడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఆభరణాలను పెట్టుబడిగా చూడొద్దు. ధరించడానికి కావాల్సినంత వరకే ఆభరణాలకు పరిమితం కావాలి. పెట్టుబడి కోసం అయితే ఎలక్ట్రానిక్ రూపంలో ఎన్నో సాధనాలు ఉన్నాయి. వీటిల్లో తమకు నచ్చిన దానిని ఎంపిక చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్స్, సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీలు), డిజిటల్ గోల్డ్ అందుబాటులో ఉన్న పలు రకాల సాధనాలు. వీటన్నింటిలోకి ఎస్‌జీబీలు ఎక్కువ ప్రయోజనకరం.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

స్టాక్స్ మాదిరే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో నిత్యం ట్రేడ్ అవుతుంటాయి. ఇందులో చార్జీలు, వ్యయాలు చాలా తక్కువ. భౌతిక బంగారం ధరలకు అనుగుణంగానే గోల్డ్ ఈటీఎఫ్ ధర ఏరోజుకారోజు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో మారుతుంటుంది. నచ్చినప్పుడు కొనుగోలు చేసుకుని, అవసరమైనప్పుడు సులభంగా విక్రయించుకోవచ్చు. వీటిల్లో ఎక్స్‌పెన్స్ రేషియో రూపంలో ఏటా నిర్ణీత మొత్తాన్ని చార్జీగా తీసుకుంటారు. వీటిల్లో ఇన్వెస్ట్ చేయాలంటే డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. ఉదాహరణకు ఎల్ఐసీ గోల్డ్ ఈటీఎఫ్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో 0.41 శాతంగా ఉంది. ఈ ఫండ్‌లో రూ.లక్ష ఇన్వెస్ట్ చేశారనుకోండి. దీనిపై 0.41 శాతం ప్రకారం రూ.410ని ఎక్స్‌పెన్స్ రేషియో కింద ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ వసూలు చేస్తుంది. ఇది కూడా సంవత్సరానికి ఒకే విడతగా కాకుండా, ఏ రోజుకారోజు ఇన్వెస్టర్ యూనిట్ల నుంచి తీసుకుంటుంది. పెట్టుబడులను ఉపసంహరించుకుంటే ఎగ్జిట్ లోడ్ ఉండదు. పెట్టుబడులపై వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి చూపించి, తాము ఏ శ్లాబు పరిధిలోకి వస్తే ఆ మేరకు పన్ను చెల్లించాలి.

గోల్డ్ ఫండ్స్

ఇన్వెస్టర్ల పెట్టుబడులను తీసుకెళ్లి గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడమే గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ చేసే పని. కనుక వీటికి బదులు నేరుగా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోనే పెట్టుబడులు పెట్టుకోవచ్చు. కానీ, కొందరికి గోల్డ్ మ్యూచువల్ ఫండ్సే అనుకూలం. ఎలా అంటే.. గోల్డ్ ఈటీఎఫ్ ఒక యూనిట్ ఒక గ్రాము బంగారం పరిమాణంలో



ట్రేడవుతుంటుంది. కనుక ఎంతలేదన్నా ఒక గ్రాము బంగారం స్థాయిలో ఒకే విడత ఇన్వెస్ట్ చేసుకోవాల్సి వస్తుంది. అదే గోల్డ్ మ్యూచువల్ ఫండ్‌లో అయితే రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడికి డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. కొనుగోలు చేసిన యూనిట్లు డీమ్యాట్ ఖాతాకే జమ అవుతాయి. కానీ గోల్డ్ ఫండ్స్‌లో పెట్టుబడులకు డీమ్యాట్ ఖాతా తప్పనిసరి కాదు. కాకపోతే గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకునే వారికి కొంచెం అదనపు భారం పడుతుంది. గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడం వల్ల అక్కడ ఎక్స్‌పెన్స్ రేషియో.. తిరిగి గోల్డ్ మ్యూచువల్ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో పేరిట రెండు సార్లు చార్జీ చెల్లించాల్సి వస్తుంది. వీటిల్లో పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని రిటర్నుల్లో చూపించి, తమ శ్లాబు రేటు ప్రకారం చెల్లించాలి.

డిజిటల్ గోల్డ్

ఫోన్‌పే, పేటీఎం, పలు ఫిన్‌టెక్ సంస్థలు డిజిటల్ గోల్డ్ కొనుగోలుకు వీలు కల్పిస్తున్నాయి. రూపాయి నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎప్పుడు కావాలంటే అప్పుడు విక్రయించుకోవచ్చు.



ఇన్వెస్టర్ కొనుగోలు చేసిన పరిమాణం మేర అసలైన బంగారం ఖజానాల్లో భద్రపరుస్తారు. కొంత మొత్తం సమకూరిన తర్వాత (కనీసం 10 గ్రాములు అంతకుమించి) భౌతిక రూపంలో తీసుకోవచ్చు. లేదా ఎంపిక చేసిన జ్యుయలరీ సంస్థల్లో ఆభరణాల కిందకు మార్చుకోవచ్చు. అవసరం ఏర్పడితే దీనిపై రుణం పొందొచ్చు. ఇందులో కాస్త చార్జీలు ఎక్కువ. ఒక ఇన్వెస్టర్ ఒక ప్లాట్‌ఫామ్‌లో గరిష్టంగా రూ.2లక్షలు మించి కొనుగోలు చేయలేరు. ఆర్‌బీఐ, సెబీ తదితర నియంత్రణ సంస్థల పర్యవేక్షణ వీటిపై ఉండదు. ఇందులో వచ్చే లాభాలు సైతం వార్షిక ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది.

బంగారం బాండ్లు

భౌతిక బంగారంపై పెట్టుబడుల ఒత్తిడిని తగ్గించేందుకు.. డిజిటల్ రూపంలో బంగారంపై పెట్టుబడులను, పారదర్శకతను ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకొచ్చిన సాధనమే సావరీన్ గోల్డ్ బాండ్స్ పథకం. ప్రతీ ఆర్థిక సంవత్సరంలోనూ ఒకటికి మించిన పర్యాయాలు ఎస్‌జీబీలను ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ విక్రయిస్తుంటుంది. ఒక గ్రాము డినామినేషన్ రూపంలో బాండ్లను కొనుగోలు చేసుకోవచ్చు. ఇష్యూ సమయంలో ఒక గ్రాము ధర ఎంతన్నది ఆర్‌బీఐ ప్రకటిస్తుంటుంది. బ్యాంక్‌లు, బ్రోకరేజీ సంస్థలు, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ కొనుగోలుకు అవకాశం కల్పిస్తుంటాయి. ఈ బాండ్ కాల వ్యవధి ఎనిమిదేళ్లు. ఇందులో పెట్టుబడిపై ఏటా 2.5 శాతం చొప్పున ఎనిమిదేళ్ల పాటు వడ్డీని ఆర్‌బీఐ ప్రతి ఆరు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తుంది. ఎనిమిదేళ్ల తర్వాత బంగారం మార్కెట్ ధర ప్రకారం ఇన్వెస్టర్‌కు ఆర్‌బీఐ చెల్లింపులు చేస్తుంది. లాభంపై పన్ను లేకపోవడం, ఏటా 2.5 శాతం రాబడి వల్ల అన్నింటిలోకి ఇది మెరుగైన సాధనం అని చెప్పుకోవాలి. ఇక ఎస్‌జీబీపై ఏటా వచ్చే 2.5 శాతం వడ్డీ రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. రిటర్నుల్లో 'ఇన్‌కమ్ ఫ్రమ్ అదర్ సోర్సెస్'లో చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎనిమిదేళ్ల పాటు పెట్టుబడి కొనసాగించినట్టయితే.. వచ్చే మూలధన లాభంపై పన్ను ఉండదు. మధ్యలోనే వైదొలిగితే లాభం పన్ను పరిధిలోకి వస్తుంది. "ఏడాదిలోపే విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి కలిపి రిటర్నుల్లో చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది తర్వాత విక్రయించేట్టు అయితే లాభంపై 10 శాతం పన్ను చెల్లించాలి. లాభం నుంచి ద్రవ్యోల్బణాన్ని తీసేసే ఇండెక్సేషన్ ఎంపిక చేసుకుంటే కనుక 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది" అని ఆర్ఎస్ఎం ఇండియా వ్యవస్థాపకుడు సురేష్ సురానా తెలిపారు. ఈ బాండ్‌కు ప్రభుత్వ హామీ ఉంటుంది.

రాబడులు

బంగారంపై పెట్టుబడి దీర్ఘకాలంలో డెట్ కంటే మెరుగైన రాబడే ఇచ్చినట్టు చారిత్రక గణాంకాలు చెబుతున్నాయి. గడిచిన 20 ఏళ్లలో ఏటా 11 శాతం కాంపౌండెడ్ రాబడిని బంగారం ఇచ్చింది.

సంవత్సరం వారీ 10 గ్రాముల బంగారం ధరలు (రూపాయిల్లో)

సంవత్సరం	ధర
2015	26,343
2016	28,623
2017	29,667
2018	31,438
2019	35,220
2020	48,651
2021	48,720
2022	52,670
2023	65,330
2024	71,913



ఎస్‌జీబీల్లో రాబడి

ఇండియా బులియన్‌అండ్ జ్యుయలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రకటించే 999 స్వచ్ఛత బంగారం (గత మూడు పనిదినాల్లోని సగటు)ధరను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకుంటుంది. ఐబీజేఏ ధర మార్కెట్ ఆధారితమే. మొదటి విడత జారీ చేసిన ఎస్‌జీబీ 2016- సిరీస్1 బాండ్ గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 8న ముగిసింది. నాడు ఒక గ్రాము బాండ్ రూ.2,600కు విక్రయించారు. గడువు ముగిసిన రోజు ఆర్‌బీఐ నిర్ణయించిన ధర రూ.6,271. ఇందులో ఇన్వెస్ట్ చేసి చివరి వరకు కొనసాగిన వారికి ఏటా 11% రాబడి వచ్చింది. 2.5% వడ్డీ రాబడిని కలిపి చూస్తే వార్షికంగా 11.63 శాతం చొప్పున నికర రాబడి వచ్చినట్టు. ఇది బంగారం గత 20 ఏళ్ల సగటు రాబడి కంటే ఎక్కువే ఉండడం గమనార్హం. తర్వాత వచ్చిన సిరీస్‌లపై రాబడులు మరింత అధికంగా ఉంటున్నాయి.

సిరీస్-8, 9 రాబడులు

బాండ్	జారీ తేదీ	జారీ ధర (రూ.లో)	మెచ్యూరిటీ ధర (రూ.లో)	వడ్డీ రాబడి
ఎస్‌జీబీ 2017-18,సిరీస్-8	20 నవంబర్ 2017	2,961	7,217	16.50
ఎస్‌జీబీ 2017-18, సిరీస్-9	27 నవంబర్ 2017	2,964	7,217	16.44

2017 నవంబర్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 మధ్య నిఫ్టీ50 సూచీ ఇచ్చిన వార్షిక కాంపౌండెడ్ రాబడి 13.62% ఎస్‌జీబీ సిరీస్-8,9 కంటే తక్కువగా ఉండడం గమనించొచ్చు. (వడ్డీ శాతాల్లో)

ఇతర వివరాలు

ఎస్‌జీబీలపై వడ్డీని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇన్వెస్టర్ బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారు. చివరి ఆరు నెలల వడ్డీ, మెచ్యూరిటీతో కలిపి ఇస్తారు. ఒక ఇన్వెస్టర్ కనిష్టంగా ఒక గ్రాము, గరిష్టంగా ఒక ఆర్థిక సంవత్సరంలో 4 కిలోల వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఎస్‌జీబీలను ఎనిమిదేళ్ల పాటు గడువు పూర్తయ్యే వరకు కొనసాగించినప్పుడే లాభంపై ఎలాంటి పన్ను పడదు. ఒకవేళ ఈ మధ్యలోనే వైదొలిగితే లాభం వార్షిక ఆదాయానికి కలిపి చూపించి పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారికి ప్రతి గ్రాముపై రూ.50 తగ్గింపు లభిస్తుంది.

కేటాయింపులు ఎంత మేర?

ఒకరి మొత్తం పెట్టుబడుల్లో కనీసం 5% బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవాలన్నది నిపుణుల సూచన. గరిష్టంగా 10 వరకు కేటాయించుకోవ చ్చు. మోస్త రు రాబడులు వచ్చినా ఫర్వాలేదు, రిస్క్ వద్దనుకునే ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలో 15% వరకు కూడా బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవ చ్చు. కానీ, పెట్టుబడి కోసం భౌతిక బంగారం అంత మెరుగైన ఆప్షన్ కాబోదు. ఎందుకంటే అసలు బంగారం ధరకు తోడు, కొనుగోలు ధరపై 3% మేర జీఎస్టీని భరించాల్సి ఉంటుంది. అదే పెట్టుబడి కోసం అని చెప్పి ఆభరణాలు కొనుగోలు చేస్తే దానిపై తయారీ చార్జీలు, తరుగు భరించాల్సి వ స్తుంది. ఇవన్నీ నికర రాబడులను ప్రభావితం చే స్తాయి. కనుక బంగారంపై పెట్టుబడి ఎప్పుడూ కూ డా డిజిటల్‌గానే ఉంచుకోవడం మంచి ఆప్షన్ అవుతుంది. దీనివల్ల భద్రతాపరమైన రిస్క్ కూడా ఉండదు.

ముందస్తు ఉపసంహరణ ఎలా?

ఎస్‌జీబీ కాల వ్యవధి ఎనిమిదేళ్లు అయినప్పటికీ.. కోరుకుంటే ఆ లోపు కూడా విక్రయించుకోవచ్చు. కొనుగోలు చేసిన తేదీ నుంచి ఐదేళ్లు ముగిసిన తర్వాత ఆర్‌బీఐ ముందస్తు ఉపసంహరణకు వీలు కల్పిస్తోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ అవకాశం ఉంటుంది. బంగారం బాండ్‌పై ఆరు నెలలకు ఒకసారి ఆర్‌బీఐ వడ్డీ చెలిస్తుందని చెప్పుకున్నాం కదా. ఆ వడ్డీ చెల్లింపు తేదీ నుంచి 21 రోజుల ముందు వరకు ఇన్వెస్టర్ తన వద్దనున్న బాండ్‌ను ఆర్‌బీఐకి ఇచ్చేయాలి. దీనిపై ఎలాంటి చార్జీలు ఉండవు. ఇక ఇన్వెస్ట్ చేసిన తేదీ నుంచి ఐదేళ్లలోపే బాండ్‌ను విక్రయించుకోవాలంటే.. ఉన్న ఏకైక మార్గం స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ లేదా బీఎస్ఈ). కాకపోతే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో కొనుగోలుదారులు పరిమితంగా ఉంటుంటారు. లిక్విడిటీ తక్కువగా ఉంటుంది. కొనుగోలుదారు అందుబాటులో ఉంటే విక్రయించుకోవచ్చు. కాకపోతే డిమాండ్ తక్కువ కనుక మార్కెట్ రేటు కంటే తక్కువకే ఇక్కడ విక్రయాలు నమోదవుతుంటాయి. బంగారం బాండ్ భౌతిక రూపంలో ఉంటే దాన్ని డీమెటీరియలైజ్ చేసుకున్న తర్వాతే విక్రయించుకోవడం సాధ్యపడుతుంది.



టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్

మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్



ప్రైవేట్ రంగ జీవిత బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది జూన్ 15 వరకు అందుబాటులో ఉంటుంది. యూనిట్ ఎన్ఏవీ రూ.10గా ఉంటుంది. టాటా ఏఐఏ పాలసీదారులు కంపెనీకి చెందిన ఫార్చ్యూన్ ప్రో, వెల్త్ ప్రో, ఫార్చ్యూన్ మ్యాక్సిమా వంటి యులిప్ పథకాలు, వినూత్న పరమ్ రక్షక్ ప్లస్, ప్రో-ఫిట్ వంటి పథకాల ద్వారా ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 మూమెంటమ్ 50 ఇండెక్స్‌లో అధిక వృద్ధి అవకాశాలున్న టాప్ 50 కంపెనీల పనితీరును ఇది ట్రాక్ చేస్తుంది. దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధిని, మెరుగైన రాబడులను కోరుకుంటున్న ఇన్వెస్టర్లకు ఇది అనువైనదని సంస్థ తెలిపింది. గడిచిన 9 ఏళ్లలో మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ 11 రెట్లు పెరిగినట్లు వివరించింది. తయారీ.. సర్వీసులు వృద్ధి చెందుతుండటం, వినియోగ డిమాండ్ పెరుగుతుండటం, పొదుపు మొత్తాలు ఈక్విటీల వైపు మళ్లుతుండటం వంటి అంశాలు ఈ విభాగ సంస్థలకు సానుకూలమని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-6-2024

విశాఖ	475-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	475-00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00

రాబడుల్లో స్థిరత్వం.. డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్

మార్కెట్లో అన్ని విభాగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసుకోవాలనుకునే వారు తమ పోర్ట్‌ఫోలియోలో ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌కు చోటు కల్పించుకోవచ్చు. ఈ విభాగంలో డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తున్న వాటిల్లో ఒకటిగా ఉంది.

రాబడులు

గడిచిన ఆరు నెలల కాలంలో ఈ పథకం 7.32 శాతం రాబడిని ఇచ్చింది. అదే ఏడాది కాలంలో రాబడి 27.50 శాతంగా ఉంది. మూడేళ్లలో 13.43 శాతం, ఐదేళ్లలో 16.58 శాతం, ఏడేళ్లలో 14 శాతం, పదేళ్లలో 14.30 శాతం చొప్పున ఏటా రాబడులు ఈ పథకంలో ఉన్నాయి. ఈ పథకం 1997 ఏప్రిల్ 29న ప్రారంభమైంది. నాటి నుంచి చూస్తే ఏటా 19 శాతం రాబడిని ఇచ్చింది. గతంలో ఈ పథకం మల్టీక్యాప్‌గా ఉండేది. మ్యూచువల్ ఫండ్స్ పథకాల పునర్‌వ్యవస్థీకరణ అనంతరం సెబీ ఆదేశాల మేరకు ఫ్లెక్సీక్యాప్ విభాగం కిందకు మారింది. మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో వార్షిక రాబడి కనీసం 12 శాతంపైన ఉంటే దాన్ని మెరుగైనదిగా నిపుణులు పరిగణిస్తుంటారు.

పెట్టుబడుల విధానం

లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో ఆకర్షణీయమైన పెట్టుబడుల అవకాశాలను ఈ పథకం ఎంపిక చేసుకుంటుంది. ఒక విభాగంలో వ్యాల్యూషన్స్ ఖరీదుగా మారిన సందర్భాల్లో పెట్టుబడులు తగ్గించుకుని, ఆకర్షణీయంగా ఉన్న ఇతర విభాగాల్లోకి అధిక పెట్టుబడులు మళ్లిస్తుంటుంది. నాణ్యమైన, సత్తా ఉన్న కంపెనీలను ఎంపిక చేసుకుని, ఎక్కువ కాలం పాటు కొనసాగడాన్ని అనుసరిస్తుంది. మార్కెట్ కరెక్షన్లలో ఎక్కువగా పెట్టుబడులు పెడుతుంటుంది. లార్జ్‌క్యాప్‌నకు ఎక్కువ కేటాయింపులు చేయడం ద్వారా 2008, 2011, 2015, 2020 మార్కెట్ పతనాల్లో నష్టాలను పరిమితం చేసింది. అదే సమయంలో మార్కెట్ ర్యాలీల్లోనూ మెరుగైన ప్రదర్శనే చేసింది. 2020 మార్చి మార్కెట్ పతనం సమయంలో ఈక్విటీల్లో పెట్టుబడులు 93 శాతంగానే ఉన్నాయి. మార్కెట్ల విలువలు గరిష్టాలకు చేరాయన్న జాగ్రత్తతో నగదు నిల్వలను 7 శాతానికి పెంచుకుంది. అదే ఏడాది దిద్దుబాటు అనంతరం క్రమంగా ఈక్విటీల్లో పెట్టుబడులను పెంచుకుంది.



పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ. 10,409 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 97.39 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 2.61 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. 63 శాతం పెట్టుబడులను లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. మిడ్‌క్యాప్ కంపెనీలకు 31.63 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 4.77 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. ఎక్స్‌పెన్స్ రేషియో 1.75 శాతంగా ఉంది. ఒక విధంగా ఈ పథకం ఇన్వెస్టర్ల నుంచి ఎక్కువ చార్జీ వసూలు చేస్తున్నట్టు భావించొచ్చు. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 56 స్టాక్స్ ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోని పరిశీలిస్తే.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, 33 శాతం మేర పెట్టుబడులను ఈ రంగాల కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఇండస్ట్రియల్స్‌కు 11.95 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీకి 11.22 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 10 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 8.79 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్ (అంకెలు శాతాల్లో)

కంపెనీ	పెట్టుబడులు
బజాజ్ ఫైనాన్స్	6.49
ఐసీఐసీఐ బ్యాంక్	5.96
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.25
మదర్సన్ సుమీ	4.08
యాక్సిస్ బ్యాంక్	3.47
అవెన్యూ సూపర్‌మార్ట్స్	3.21
పాలీక్యాబ్ ఇండియా	2.81
ఇన్ఫోసిస్	2.72
ఇండస్ టవర్స్	2.64
గుజరాత్ ఫ్లోరోకెమ్	2.37

స్టాక్స్ వ్యూ

జాగిల్ ప్రీపెయిడ్	ఈక్విరస్ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 281 టార్గెట్: రూ. 400

ఎందుకంటే: జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్.. సాస్(ఎస్ఏఏఎస్) ఆధారిత వినియోగ వ్యయ(స్పెండ్స్) మేనేజ్‌మెంట్, అనలిటిక్స్ లీడింగ్ ప్లాట్‌ఫామ్. కంపెనీ ప్రత్యేక బిజినెస్ మోడల్‌ను కలిగి ఉంది. ప్రధానంగా చానల్ భాగస్వాములు, ఉద్యోగులు, వెండార్ ప్లాట్‌ఫామ్స్ కోసం ఉద్యోగుల(ఎంప్లాయీ) రీఇంబర్స్‌మెంట్స్, పన్ను లబ్ధి(ట్యాక్స్ బెనిఫిట్స్), రివార్డులు, ప్రోత్సాహకాల(ఇన్సెంటివ్స్) సంబంధ సర్వీసులు అందిస్తోంది. ప్రాడక్ట్ ద్వారా లబ్ధి పొందుతున్న కార్పొరేట్ల నుంచి ఆదాయంలో ప్రత్యక్షంగా 10 నుంచి 20 శాతమే సమకూర్చుకుంటోంది. ఇది అటు కార్పొరేట్లకు ఇటు కంపెనీకి ప్రయోజకారిగా నిలుస్తోంది. కార్డుల వినియోగం జరిగే లేదా రివార్డ్ వోచర్లు రీడీమ్ అయ్యే మర్చంట్ల నుంచి మిగిలిన ఆదాయాన్ని పొందుతోంది. కార్యకలాపాలు విస్తరించిన మూడు ప్రొడక్టుల విభాగాలలోనూ సరైన పోటీదారులు లేకపోవడం కంపెనీకి బలాన్నిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికల్లా కంపెనీ సర్వీసులందిస్తున్న రంగం దేశీ మార్కెట్ పరిమాణం రూ. 13,900 కోట్లకు చేరుతుందని పరిశ్రమ వర్గాల అంచనా. కంపెనీ లైఫ్‌సైకిల్‌లో ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉన్నట్లు భావిస్తున్నాం. వెరసి కొత్త కస్టమర్లను పొందడం, ప్రస్తుత కస్టమర్లకూ ఇతర ప్రొడక్టులను విక్రయించగలగడం(క్రాస్ సెల్లింగ్), కొత్త ప్రొడక్టులను ప్రవేశపెట్టడం, విదేశాలలోనూ కార్యకలాపాలు విస్తరించడం తదితరాల ద్వారా కంపెనీ భారీ వృద్ధికి పలు అవకాశాలున్నాయి. ఇటీవల జోయర్ పేరుతో విడుదల చేసిన వెండార్ పేమెంట్స్ సొల్యూషన్స్ దీనికి జత కలవనుంది.



ఆస్క్ ఆటోమోటివ్	జేఎమ్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుతధర:రూ. 314 టార్గెట్: రూ. 375

ఎందుకంటే: ప్రధానంగా ద్విచక్ర వాహన రంగంలో బ్రేక్ షూ, డ్రమ్ బ్రేకింగ్ సిస్టమ్స్ తయారీలో దేశీయంగా ఆస్క్ ఆటోమోటివ్ నాయకత్వ స్థాయిలో ఉంది. రెండు విభాగాలు కలిపి 50 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. టూవీలర్ బ్రేకింగ్‌లోకి ఆలస్యంగా ప్రవేశించినప్పటికీ ఈ రంగంలో వినియోగించే తేలికపరచే(లైట్ వెయిటింగ్) అల్యూమినియం విడిభాగాలు, సేఫ్టీ కంట్రోల్ కేబుళ్ల(ఎస్‌సీసీ) తయారీలో సుప్రసిద్ధ కంపెనీగా కార్యకలాపాలు విస్తరించింది. మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. ఇందుకు సొంత సాంకేతికతల అభివృద్ధి, డిజైన్, ఇంజినీరింగ్ సామర్థ్యాలు తోడ్పాటునిస్తున్నాయి. ప్రొప్రయిటరీ ఫార్ములేషన్స్ వినియోగించడం ద్వారా కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన సొల్యూషన్లను అభివృద్ధి చేసి అందిస్తోంది. అంతేకాకుండా నాణ్యత, ధర, డెలివరీలపై దృష్టి పెట్టడం ద్వారా కస్టమర్లకు చేరువగా నిలుస్తోంది. వెరసి గత కొన్నేళ్లుగా ద్విచక్ర వాహన పరిశ్రమను మించిన వృద్ధిని సాధిస్తోంది. 2013-23 కాలంలో ద్విచక్ర వాహన పరిశ్రమ సగటున 10 శాతం వార్షిక వృద్ధిని అందుకుంది. అయితే విభిన్న ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో, కొత్త కస్టమర్లను జత చేసుకోవడం, ప్రస్తుత కస్టమర్ల నుంచి వాలెట్ షేర్‌ను పెంచుకోవడం ద్వారా పరిశ్రమను మించి ప్రగతి పథంలో పరుగెడుతోంది. ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగంలో ఎలక్ట్రిక్ సాంకేతికతలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) మార్పు కారణంగా అల్యూమినియం లైట్‌వెయిటింగ్ పరికరాల విభాగంలో కిట్ విలువ బలపడుతోంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/1 B-3A, Kakkalapally Village, Ananthapur - 515 004. A.P., and Printed at Jagati Publications Limited Survey No 158/1 B-3A,Kakkalapally Village, Ananthapur - 515 004. A.P., Editor: V. Murali (Responsible for selection of News under the PRB Act), Phone No. 08554 248892, 248893, Fax No. 248894 RNI Regn No. APTEL/2008/23793.